RNI Reg-No.APTEL/2005/19204 ESTD : 1996


# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 187 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి మంగళవారం 7-7-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠ మాసం, తిథి॥సప్తమి ఉ॥8.36, ఉ.భా. మ॥12.46, వర్జ్యం మ॥12.31 - 2.05, దుర్ముహూర్తం ఉ॥8.10-9.02, శుభ సమయం మ॥12.00-1.30, రాహుకాలం మ॥3.00-4.30, సూర్యోదయం ఉ॥ 5.31, సూర్యాస్తమయం సా॥ 6.34 గం॥



## వయస్సు మళ్లినా శ్రీవారిపై అచంచలమైన భక్తి

**-116 ఏళ్ల వయస్సులోనూ కాలినడకన తిరుమలకు చేరుకున్న వృద్ధ భక్తురాలు**

**-ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసిన టీటీడీ**


**తిరుమల, జులై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీవేంకటేశ్వర స్వామివారిపై అచంచలమైన భక్తితో 116 ఏళ్ల వయస్సులో కాలినడకన తిరుమలకు చేరుకున్న తమిళనాడుకు చెందిన వృద్ధ భక్తురాలు శ్రీమతి నవనీతమ్మకు టీటీడీ సోమవారం ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసింది. ఇటీవల కాలినడకన మిగతా 2లో..

## పహల్గాం ఉగ్రదాడికి సూత్రధారి అతడే

**- ఛార్జ్‌షీట్‌లో హఫీజ్ సయీద్ పేరు**



**న్యూఢిల్లీ,జూలై6:** పహల్గాం ఉగ్రదాడికి సంబంధించిన దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనలో లష్కరే తయ్యిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌ను కీలక సూత్రధారిగా పేర్కొంటూ జాతీయ దర్యాప్తు సంస్థ సోమవారం అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ దాడికి ఉగ్రవాదులను ఆదేశించడం దగ్గర్నుంచి.. కుట్రకు ప్రణాళిక రూపొందించడం, దాన్ని అమలు చేసేలా సయీద్ ఎప్పటికప్పుడు సమీక్షించినట్లు ఆధారాలున్నాయని ఎన్ఐఏ పేర్కొంది. పహల్గాం ఉగ్రదాడి కేసులో ఇప్పటికే 1597 పేజీల ఛార్జిషీట్‌ను ఎన్ఐఏ కోర్టుకు సమర్పించింది. దీనికి అనుబంధంగా నేడు మరోసారి అభియోగపత్రాలను దాఖలు చేసింది. ఇందులో సీమాంతర ఉగ్రవాదం, హఫీజ్ సయీద్ పాత్ర, ఉగ్రవాదులకు పాక్ అండ వంటి అంశాలను పొందుపర్చింది. గతేడాది డిసెంబరు 15న దాఖలైన తొలి ఛార్జిషీట్‌లో పాకిస్థానీ హ్యాండ్లర్ సాజిద్‌తో పాటు, 2025 జులైలో జరిగిన ఆపరేషన్ మహాదేవ్‌లో భద్రతా బలగాలు హతమార్చిన ముగ్గురు ఉగ్రవాదులు, అరెస్టయిన ఇద్దరు నిందితులను ఎన్ఐఏ పేర్కొంది. దాడిలో లష్కరే తయ్యిబా, దాని అనుబంధ సంస్థ అయిన టీఆర్ఎఫ్ సంస్థల పాత్ర గురించి అభియోగపత్రంలో చేర్చింది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22, 2025న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.



## గిరిజన ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లు

**-పబ్లిక్ గ్రీవెన్స్ సమస్యలు తక్షణం పరిష్కరించాలి -అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు**

**అమరావతి,జూలై6(ఆర్ఎన్ఎ):** గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గిరిజనులకు నాణ్యమైన భోజనం అందించాలన్నదే లక్ష్యమని అన్నారు. పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని వ్యాఖ్యానించారు. పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో జీరో వేస్ట్ లక్ష్యమని పేర్కొన్నారు. సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ నుంచి వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పురపాలక, పంచాయతీరాజ్, హోం, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలపై ఈ సమావేశంలో సీఎం చర్చించారు. విశాఖపట్నం సముద్రం తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తక్షణ స్పందనగా ఏయే విభాగాలు ఎలా స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ఏపీ అభివృద్ధిలో ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్‌మెంట్- బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలని దిశానిర్దేశం చేశారు. పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మూడు నెలల్లో యూఎల్‌బీల్లో చెత్త తొలగింపు పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు. గంజాయి నిర్మూలనపై తీసుకుంటున్న చర్యలపై సమాచారం ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని నిర్దేశించారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ లాంటి అంశాల్లో స్పష్టమైన ఎస్ఓపీ జారీ చేయాలని ఆదేశించారు. నెలరోజుల్లోగా అన్ని ప్రభుత్వ శాఖలూ అవేర్ 2.0 ద్వారా ఏ మేరకు ఫలితాలు వచ్చాయో విశ్లేషించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కనెక్టివిటీ కోసం మారుమూల ప్రాంతాల్లోని టవర్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులపై నిషేధం

**-13 నుంచి అమలుకు ప్రభుత్వం నిర్ణయం**



**అమరావతి,జూలై6(ఆర్ఎన్ఎ):** ఏపీ ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, బదిలీలపై నిషేధానికి అమలు తేదీ ఖరారైంది. జులై 13వ తేదీ నుంచి పోస్టుల సృష్టి, అప్‌గ్రేడేషన్‌పై ఏపీ ప్రభుత్వం నిషేధం అమలు చేయనుంది. కొత్త నియామకాలు, పదోన్నతులు, బదిలీలు, డిప్యుటేషన్లపై నిషేధం విధించింది. స్థానిక కేడర్ల కేటాయిం పు ప్రక్రియ పూర్తయ్యే వరకు నిషేధం కొనసాగించనుంది. పీఓ-2025 అమలు నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థిక శాఖ (హెచ్ఆర్-ప్లానింగ్-పాలసీ) ఆధ్వర్యంలో ఈ మెమో జారీ చేసింది. కొన్ని శాఖల్లో కేడర్ కేటాయింపుల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో గడువు పొడిగించింది. ఉద్యోగ సంఘాల విజ్ఞప్తితో నిషేధం అమలు తేదీపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. జులై 5వ తేదీతో ముగియాల్సిన ప్రక్రియకు అదనపు గడువు ఇచ్చింది. అన్ని శాఖలు ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కలెక్టర్లు, శాఖాధిపతులు ఈ ఉత్తర్వులు అమలు చేయాలని ఆదేశించింది. స్థానిక కేడర్ల పంపిణీ పూర్తయ్యే వరకు పరిపాలనా చర్యలపై పరిమితులు ఉంటాయని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

## దలైలామా దీర్ఘాయుష్షుతో జీవించాలి

2లో

**-ఎక్స్‌లో చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు**

## ముగ్గురు అదనపు న్యాయమూర్తులు

**-ప్రమాణం చేయించిన ప్రధాన న్యాయమూర్తి లీసాగిల్**

2లో

## నేవీ, కోస్ట్ గార్డు అధికారులతో మంత్రి అచ్చెన్న సమీక్ష

**అమరావతి,జూలై6(ఆర్ఎన్ఎ):** అనకాపల్లి జిల్లా ఎస్ రాయవరం మండలం రేవు పోలవరం సముద్ర తీరంలో పడవ బోల్తా ఘటనలో మత్స్యకారుల గల్లంతుపై మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష నిర్వహించారు. సోమవారం గల్లంతైన మత్స్యకారుల గాలింపు చర్యలపై నేవీ, కోస్ట్ గార్డు అధికారులతో సమావేశమై చర్చించారు. గాలింపు చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గల్లంతైన మత్స్యకారులు క్షేమంగా తిరిగి వచ్చేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. రెండో రోజూ ప్రత్యేక నౌక, రెస్క్యూ బోటు, హెలికాప్టర్‌తో నేవీ, కోస్ట్ గార్డు సంయుక్త గాలింపు కొనసాగుతోందని మంత్రికి అధికారులు తెలిపారు. కారి చిన్న ఇచ్చిన సమాచారం ఆధారంగా మిగిలిన ఆరుగురు మత్స్యకారుల కోసం గాలింపు కొనసాగిస్తున్నామన్నారు. కారి చిన్నను విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు కోస్ట్ గార్డు తీసుకురానుంది. గల్లంతైన వారిలో కారి గంగయ్య, అమర అప్పలరాజు, కారి సితోడు, మేడ చిన అమ్మోరు, కారి చిన్నయ్య, రాగుతూ బండియ్యలు ఉన్నారు.



## ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు.. లక్ష ఉద్యోగాలు

**-ఎపి లక్ష్యం ఇదేనని వెల్లడించిన మంత్రి లోకేశ్**

**అమరావతి,జూలై6(ఆర్ఎన్ఎ):** ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలే లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. సోమవారం దక్షిణ కొరియాలో సియోల్ బిజినెస్ ఏజెన్సీ కొరియన్ స్టార్టప్ ఫౌండర్లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొని మాట్లాడారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లోకి కొరియన్ స్టార్టప్‌లకు ఆహ్వానం పలికారు. భారతదేశ ఏఐ రాజధానిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతామని చెప్పుకొచ్చారు. అమరావతి కేంద్రంగా ఆర్టీఐహెచ్.. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, అనంతపురంలో ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. ఇప్పటికే 2,500కు పైగా స్టార్టప్‌లకు ఆర్టీఐహెచ్ మద్దతు ఇచ్చిందని వివరించారు. 5,200 మందికి మిగతా 2లో..

## అభివృద్ధికి అడ్డుపడితే గుణపాఠం తప్పదు

**-వైసిపికి మంత్రి నారాయణ హెచ్చరిక**



**నెల్లూరు,జూలై6(ఆర్ఎన్ఎ):** ఏపీలో జరుగుతున్న అభివృద్ధి పనులకు అడ్డుపడితే ప్రజలు సహించరని.. మంచిని చెడుగా చూపిస్తే, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పురపాలక శృాఖ మంత్రి నారాయణ హెచ్చరించారు. సోమవారం నెల్లూరులో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మల్లెల సంజీవయ్య హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లో మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో మూసేసిన వీఆర్సీని కూటమి ప్రభుత్వం అధికారంలోకి మిగతా 2లో..

## మత్స్యకారుల గల్లంతుపై డిప్యూటీ సిఎం ఆందోళన

**-గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని పవన్ ఆదేశం**



**అమరావతి,జూలై6(ఆర్ఎన్ఎ):** విశాఖ హార్బర్ నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారులు గల్లంతైన ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. సముద్రంలో మత్స్యకారుల గల్లంతుపై ఆరా తీశారు. విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెరైన్ పోలీసులు, కోస్టు గార్డు, నేవీ సహకారం తీసుకోవాలని సూచించారు. గల్లంతైన మత్స్యకారులను రక్షించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని.. ఆందోళన చెందవద్దని వారి కుటుంబ సభ్యులకు పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. భోగాపురం మత్స్యకారులు గల్లంతుపై విజయనగరం, విశాఖ కలెక్టర్లు రామ్ సుందర్‌రెడ్డి, అభిషిక్త్ కిషోర్‌తో మంత్రి కొండపల్లి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మత్స్యకారులను రక్షించేందుకు చేపట్టిన చర్యలను మంత్రికి వివరించారు కలెక్టర్లు. గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల నాయకుడితో ఫోన్లో మాట్లాడినట్లు మంత్రికి, ఎంపీకి వివరించారు కలెక్టర్లు. ఏడుగురు మత్స్యకారుల్లో ఆరుగురికి లైఫ్ జాకెట్లు ఉన్నాయని.. ఒకరికి లైఫ్ జాకెట్ లేనట్లుగా చెప్పారు కలెక్టర్లు. నేవీ హెలికాప్టర్ల ద్వారా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినట్లుగా చెప్పారు కలెక్టర్లు. సముద్ర తీర ప్రాంతానికి దగ్గర్లోనే ఉండటంతో మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని మంత్రి తెలిపారు. మత్స్యకారులను సేఫ్‌గా తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ముమ్మరంగా గాలిస్తోందని మంత్రి కొండపల్లి, ఎంపీ కలిశెట్టి వివరించారు.

## బెంగాల్లో మూడు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్


**-24న ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల**




**కోల్‌కతా,జూలై6(ఆర్ఎన్ఎ):** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల రాజీనామాలతో మూడు రాజ్యసభ స్థానాలకు ఖాళీలు ఏర్పడ్డ సంగతి తెలిసిందే. ఎంపీలు సుఖేందు శేఖర్ రాయ్, సుస్మితా దేవ్, ప్రకాష్ చిక్ బారైక్ రాజీనామాలతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. భారత ఎన్నికల సంఘం ఈ మూడు రాజ్యసభ స్థానాలకు సంబంధించి ఉప ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. జులై 24వ తేదీన మూడు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. జూలై 7వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. నామినేషన్ల సమర్పణకు జూలై 14 ఆఖరి తేదీ అని పేర్కొంది. ఎన్నికల సంఘం మూడు ఖాళీలను విడివిడిగా పరిగణిస్తూ ప్రత్యేకంగా నోటిఫికేషన్లు జారీ చేసి, పోలింగ్ నిర్వహించనుంది. జులై 24వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. బ్యాలెట్ పేపర్‌పై ఓటు వేయడానికి రిటర్నింగ్ అధికారి ఇచ్చే ప్రత్యేక ఊదా రంగు పెన్ను మాత్రమే వాడాలని, ఇతర పెన్నులు వాడితే ఓటు రద్దవుతుందని ఎన్నికల సంఘం తెలిపింది. ఇక, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభంకానుంది. ఓట్ల లెక్కింపు పూర్తైన వెంటనే ఫలితాలు వెల్లడించనున్నారు.

## రూ.500 కోట్ల సాస్కి నిధులతో గురుకుల భవనాలు

**-అదనంగా మరో 10 కొత్త బీసీ గురుకులాల ఏర్పాటు -బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత వెల్లడి**




**అమరావతి,జూలై6(ఆర్ఎన్ఎ):** రూ.500 కోట్ల సాస్కి నిధులతో ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి సవిత చెప్పారు. రాష్ట్రంలో ఉన్న 109 గురుకులాలకు అదనంగా మరో 10 కొత్త బీసీ గురుకులాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీసీ విద్యార్థులకు నీట్, ఐఐటీ ప్రవేశాల కోసం టేకులోడు, సింహాచలంలో రెండు ఎక్స్‌లెన్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. బీసీ సంక్షేమానికి తొలి మూడు బడ్జెట్లలో వరుసగా రూ.39 వేల కోట్లు, రూ.47 వేల కోట్లు, రూ.51 వేల కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించిందని మంత్రి సవిత తెలిపారు. సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. మూడో బ్జడెట్‌లో బీసీల సంక్షేమం కోసం రికార్డు స్థాయిలో రూ.51 వేల కోట్లు కేటాయించామన్నారు. ఆరు బాలికల గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉన్నత విద్యకు అవకాశం కల్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రూ.26.71 కోట్లతో 62 ఎంజేపీ గురుకుల భవనాల మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, క్రీడా సామగ్రి, ట్రాక్‌సూట్లను అందజేస్తున్నామన్నారు. చెస్‌లో ప్రతిభ పెంపొందించేందుకు ఏపీ చెస్ అకాడమీతో ఎంవోయూ కుదుర్చుకున్నామని తెలిపారు. 998 బీసీ హాస్టళ్లలో 85 వేల మంది విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. రెండేళ్లలో రూ.80 కోట్లతో బీసీ హాస్టళ్ల మరమ్మతులు, మౌలిక వసతులను అభివృద్ధి చేశామని మంత్రి తెలిపారు. 772 హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు, 642 హాస్టళ్లలో ఇన్వర్టర్లను ఏర్పాటు చేశామన్నారు. సివిల్స్, డీఎస్సీ, గ్రూప్-1, గ్రూప్-2 పోటీ పరీక్షలకు బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం, అనంతపురం, తిరుపతిలో మూడు ప్రత్యేక బీసీ స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రూ.1000 కోట్లతో ఆదరణ-3.0 అమలు చేసి బీసీలకు ఆధునిక పరికరాలను పంపిణీ చేస్తామన్నారు. బీసీల ఆత్మగౌరవం కోసం దేశంలోనే తొలి బీసీ రక్షణ చట్టాన్ని ప్రభుత్వం తీసుకురానుందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లో బీసీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సవిత తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రెండేళ్లలో 117.68 లక్షల మంది లబ్దిదారులకు రూ.32,533.68 కోట్ల సహాయం అందించామన్నారు. గత ఐదేళ్ల కాలంలో గొడ్డలి పార్టీ అక్రమాలకు చట్టప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. రైజింగ్ రాయలసీమ.. మిగతా 2లో..

## విలేజ్ మార్ట్‌ల ఏర్పాటు

**-మార్కెట్ ధరలకన్నా తక్కువగా సరుకుల విక్రయం**

**-ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రారంభించిన మంత్రి నాదెండ్ల**



**గుంటూరు,జూలై6(ఆర్ఎన్ఎ):** గ్రామాల్లో విలేజ్ మార్ట్‌లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రేషన్ షాపుల ద్వారా తక్కువ ధరకే నిత్యావసరాల అమ్మకాలు జరగనున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గం లాల్‌పురంలో పైలట్ ప్రాజెక్ట్‌ను మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యే రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రస్తుతం ఒక్కరోజే 7 విలేజ్ మార్ట్‌లు ప్రారంభించామని తెలిపారు. జగన్ హయాంలో రాష్ట్రంలోని 29,750 రేషన్ షాపులను పూర్తిగా నిర్వీర్యం చేశారని మంత్రి నాదెండ్ల మండిపడ్డారు. గ్రామీణ రేషన్ వ్యవస్థలో కార్పొరేట్ తరహా సంస్కరణలు తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా రేషన్ షాపులను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా 1,000 మినీ మార్ట్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పుకొచ్చారు. ఓపెన్ మార్కెట్ రేట్ల కంటే రూ.3 నుంచి రూ.4 తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు, మిల్లెట్స్ పంపిణీ చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుతానికి 60 రకాల సరకులతో మినీ మార్ట్‌లు ప్రారంభించినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో 250 రకాల వస్తువులు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. విలేజ్ మార్ట్‌ల్లో కూడా త్వరలోనే డిజిటల్ పేమెంట్స్ అవకాశం కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు.

మనస్సు ఎంత నిర్మలమైతే, దాన్ని నిగ్రహించడం అంత సులభమౌతుంది. మనస్సును నిగ్రహించాలనుకుంటే, చిత్తశుద్ధికి తప్పకుండా ప్రాధాన్యం ఇవ్వాలి.

**నేటి మనదేశమ్ సంపాదకీయం**

# హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

కుళ్లిన ఆహార పదార్థాలు, బొద్దింకలు, చెత్తా చెదారం నిండిన కిచెన్, కాలం చెల్లిన ఆహార పదార్థాలు, ఇలా ఒక్కటేమిటీ అన్నీ కంపే. ఇటీవలి కాలంలో తెలంగాణ రాజధాని ఘనత వహించిన హైదరాబాద్‌లో వరుస దాడుల్లో మన హోటళ్ల బండారం బయటపడింది. ఆకలితో నకనకలాడుతున్న వారంతా ఆవురావురుమని తింటున్న ఆహారపదార్థాలు కుళ్లిన, కాలం చెల్లిన పదార్థాలతో తయారు చేస్తున్నారని అధికారులు బయట పెట్టారు. ఎంతో నమ్మకంతో హోటల్‌కు వెళ్లిన వారికి ఇలాంటి తిండి పెడుతూ కోట్లు వెనకేసుకుంటున్న హోటళ్లను మూసేయాల్సిందే. వారిని వెనక ఉండి నడిపిస్తున్న రాజకీయ నాయకుల భరతం పట్టాల్సిందే.ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిని అస్సలు వదలకూడదు. ఎందుకంటే వీరి వండివారుస్తున్న తిండి వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. కొత్త కొత్త జబ్బులు కొని తెచ్చుకుంటున్నారు. ఇవన్నీ గుర్తించి ఇలాంటి హోటల్ వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప హైదరాబాద్ పరువు కాపాడుకోలేం. ఇటీవల నగరరంలో వరుసగా ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసి వందల కేసులు నమోదు చేశారు. ప్రఖ్యాత హోటళ్లలోనే కంపు కొట్టేలా కిచెన్‌లు ఉంటున్నాయి. కుళ్లిన మాంసాన్ని ఫ్రీజర్‌లో పెట్టి వండి మన ముఖాన పడేస్తున్నారు. ఇకపోతే మేక మాంసంలో ఎద్దుమాసం కలిపి అమ్ముతున్న వారు హోటళ్లకు కూడా దానిని సరఫరా చేస్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే హైదరాబాద్ హోటళ్లు అంటేనే భయమేసేలా దారుణమైన పరిస్థితి తయారయ్యింది. కొంతకాలం పాటు ఎవకవరు కూడా హోటల్‌కు వెళ్లకుండా ఉంటే వారు దారికొచ్చేలా ఉన్నారు. ప్ర.ంలో హైదరాబాద్ అంటే ఎంతో పేరుంది. పర్యాటక రంగంలో ప్రపంచంలో మంచి స్థానం సంపాదించుకుంది. అంతర్జాతీయ పెట్టుబడులన్నీ హైదరాబాద్‌లోనే పెడుతున్నారు. ఐటి రంగంలో బాగా విస్తరించింది. అనేక అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. దీంతో దేశవిదేశీయులు అనేకమంది ర ఓజూ హైదరాబాద్ సందర్శనకు వస్తుంటారు. ఇలాంటి ప్రతిభ ఉన్న భాగ్యనగరం కాస్తా మసకబారిపోతోంది. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు ఇలా కుళ్లిన, కాలం చెల్లిన ఆహార పదార్థాలను వండిపెడితే వారి ఆరోగయం ఏం కాను. మనం తినే ఆహారం పరిస్థితి దారుణంగా ఉందన్న నిజాలు దాడులతో తెలిసింది. ఇటీవలి కాలంలో వరుసగా ఆహార భద్రతా అధికారులు జరిపిన మెరుపు దాడుల్లో వెలుగుచూసిన దృశ్యాలు చూ స్తుంటే, మనం తింటున్నది ఆహారమా లేక విషమా అనే భయం కలుగుతోంది. ఒకవైపు పర్యాటక భాగ స్వామ్యాల గురించి చర్చలు జరుపుకుంటూనే, మరోవైపు మన నగరంలోని కనీస పరిశుభ్రతను కూడా కాపాడుకోలేక పోతున్నాం. ప్రజలు కూడా తమ పరిసరాలు కాపాడుకోవడం లేదు. నగరాన్ని చెత్తతో నింపి నరకకూపంగా మార్చేస్తున్నారు. ఇది రకమైన అభివృద్ధి అన్నది ప్రజలు ఆలోచించాలి. ట్రాఫిక్ జామ్‌లు, వరదలొస్తే నాలాలు పొందగం, రోడ్లు చెరువులను తలపించడం, ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు తలపించడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి దుర్భర పరిస్థితులు మంచిదా అన్నది ప్రజలు కూడా ఆలోచన చేయాలి. ఇది కచ్చితంగా మన నగరాన్ని మనమే చేజేతులా నాశనం చేసుకుంటున్నామని గుర్తించాలి. హైదరాబాద్ నగరం గ్లోబల్ వేదికగా మారుతున్న వేళ ప్రజలుగా మనమంతా ఎలా ఉండాలో తెలుసుకోవాలి. అందమైన ఆకాశ హర్మ్యాలు ఉంటే సరిపోదు. ఇక్కడికి వచ్చే పర్యాటకులు హైదరాబాద్ అందాలను చూసి మురిసి పోవాల్సిందే. అలాగే పరిశుభ్రత కూడా ఇక్కడ ముఖ్యం. అలాగే ఇక్కడ దొరికే తిండి మంచిదనే భరోసా ఉండాలి. సామాన్యుడు కడుపు నిండా భోజనం చేసి, ఆరోగ్యంగా బయటకు వస్తాడనే భరోసా కల్పించడం పాలకుల ప్రాథమిక బాధ్యత. కానీ, నేడు పరిస్థితి దానికి విరుద్ధంగా ఉంది. అధికారులు దాడులు చేసిన ప్రతిసారీ గడువు ముగిసిన నిల్వలు, కుళ్ళిన మాంసం, అపరిశుభ్రమైన వంటశాలలు, ఎలుకలు, బొద్దింకల స్వైరవిహారం దర్శనమిస్తున్నాయి. ఇదంతా ఒకేరోజులో పుట్టుకొచ్చిన సమస్యలు కావు. సంవత్సరాల తరబడి వ్యవస్థలో పెనవేసుకుపోయిన అవినీతికి, అధికారుల నిర్లక్ష్యానికి, యజమానుల కాసుల కక్కుర్తికి నిదర్శనం. అధికారులు తనిఖీలు చేసి, ఏదో నామమాత్రపు జరిమానాలు విధించి, హోటల్ యజమానిని వదిలేయడం వల్ల వస్తున్న ఉపద్రవంగా గుర్తించాలి. హోటళ్లలో అపరిశుభ్రత, కాలం చెల్లిన పదర్థాలను వాడితే కఠిన చర్యలు ఉండాలి. అవసరమైతే ఆ హోట్‌లను మూసేయాలి. జరిమానాలు విధించారు. హోటల్ నిర్వహణలో నిబంధనలు పాటించకపోతే, అది ప్రజారోగ్యంతో చెలగాటంగానే చూడాలి. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నేరంగా పరిగణించి, అందుకు తగ్గట్లుగా కఠిన చర్యలు తీసుకోవాలి. ఆయా హోటళ్ల యజమానులను రక్షించే రాజకీయ దగుల్బాజీలను పట్టుకోవాలి. దాడులు జరిగినప్పుడు కొన్ని రోజులు హడావుడి చేయడం, ఆ తర్వాత మళ్లీ మామూలే అనిపించడం వల్లనే ఈ వ్యాపారస్తుల్లో ఏమాత్రం భయం ఉండటం లేదు. నిజానికి, మన నగరం ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా ఎదగాలంటే, హోటల్ పరిశ్రమలో కఠినమైన 'ఫుడ్సేఫ్టీ ఆడిట్ విధానాన్నితీసుకు రావాలి. నిబంధనలు అతిక్రమించిన హోటల్ లైసెన్స్‌ను శాశ్వతంగా రద్దు చేయాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటారన్న భయం కల్పించాలి. అప్పుడే మన హోటల్ వ్యవస్థ బాగుపడుతుంది. లేకుంటే ఇలాగే కుళ్లిన ఆహార పదార్థాలతో ప్రజల ప్రాణాలతో చెలగటం తప్పదు.

# దక్షిణ కొరియా పర్యటనలో లోకేశ్

### -పెట్టుబడుల కోసం పలువురితో వరుస భేటీలు

**అమరావతి,జూలై6(ఆర్ఎన్ఎ):** దక్షిణ కొరియా పర్యటనలో ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ బిజీబిజీగా ఉన్నారు. ఏపీలో పెట్టుబడులే లక్ష్యంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలతో వరుసగా భేటీ అయి చర్చలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా హ్యూఆల్స్ చైర్మన్ లీ చియాంగ్-గెన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలో హ్యూఆల్స్ పాదరక్షల యూనిట్ పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని హ్యూఆల్స్‌కు మంత్రి ఆహ్వానం పలికారు. ఏపీని రిటైల్, డిస్ట్రిబ్యూషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. మంత్రి లోకేశ్ విజ్ఞప్తిపై హ్యూఆల్స్ చైర్మన్ సానుకూలంగా స్పందిస్తూ.. ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామన్నారు. ఏపీలో రూ.300 కోట్లతో హ్యూఆల్స్ యూనిట్ ఏర్పాటు కానుంది. దీని ద్వారా 3 వేల మందికి ఉపాధి లభించనుంది. సోలమ్ (గ్రూప్ గ్లోబల్ ఆపరేషన్స్) ఆఫీసర్ జీజాబ్ హాతో మంత్రి భేటీ అయ్యారు. శ్రీసిటీలో సోలమ్ యూనిట్ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీసిటీలో ఎలక్ట్రానిక్ షెల్ఫ్ లేబుల్స్ తయారీ విస్తరణకు మంత్రి ఆహ్వానించారు. శ్రీసిటీ ప్లాంట్ పనులు వేగవంతం చేస్తామని సోలమ్ సంస్థ పేర్కొంది. రూ.338 కోట్లతో శ్రీసిటీలో సోలమ్ ఈవీ ఛార్జర్ యూనిట్ నిర్మాణం జరగనుంది. ఆపై సాఫ్ట్-ఈపీఐ సీఈవో సుంగ్ మిన్ హ్వాంగ్, సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ ఇన్-సుంగ్ చోతో మంత్రి సమావేశమయ్యారు. ఏపీలో మైక్రో ఎల్ఈడీ డిస్‌ప్లే మెటీరియల్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. తిరుపతి ఐఐటీ సహకారంతో అడ్వాన్స్‌డ్ ఎపిటాక్సీ సెంటర్‌కు ఆహ్వానం పలికారు. ఏటా 500 మంది టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చే అకాడమీ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఈ సందర్భంగా సాఫ్ట్-ఈపీఐ సీఈవో తెలిపారు. కొరియా పర్యటనలో పెట్టుబడుల ఆకర్షణపైనా మంత్రి లోకేశ్ దృష్టి సారించారు.

# ఎపిలో పలువురు ఐపిఎస్‌ల బదిలీ

**అమరావతి,జూలై6(ఆర్ఎన్ఎ):** ఏపీలో పలువురు ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. పలు జిల్లాలకు ఓఎస్డీలను, అదనపు ఎస్పీలను నియమిస్తూ కూటమి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీల్లో భాగంగా మార్కాపూర్ జిల్లా ఓఎస్డీ (అడ్మినిస్ట్రేషన్)గా నవ్ జ్యోతి మిశ్రాను నియమించారు. తూర్పుగోదావరి (రాజమండ్రి) అదనపు ఎస్పీ అడ్మిన్‌గా పాటిల్ దేవ్ రాజ్ మనీష్‌ను బదిలీ చేశారు. అలాగే మండా జావలి అల్ఫోన్స్‌ను పోలవరం జిల్లా ఓఎస్డీగా నియమించారు. అమరావతి ఓఎస్డీ లా అండ్ ఆర్డర్‌గా మనోజ్ రామనాథ్ హెగ్డేను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. రోహిత్ కుమార్ చౌదరికి పల్నాడు జిల్లా అదనపు ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. నంద్యాల అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా (ఏఎస్పీ) సుస్మితను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ బదిలీలు చేపట్టినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# ముగ్గురు అదనపు న్యాయమూర్తులు

### -ప్రమాణం చేయించిన ప్రధాన న్యాయమూర్తి లీసాగిల్





**అమరావతి,జూలై6(ఆర్ఎన్ఎ):** ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తగా నియమితులైన సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తమ్ కుమార్ చింతలపూడి అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఆమోదం తెలపడంతో కేంద్ర న్యాయశాఖ అధికారిక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నియామకాలతో ఆంధప్రదేశ్ హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 29 నుంచి 32కు పెరిగింది. హైకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతన అదనపు న్యాయమూర్తులకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ శుభాకాంక్షలు తెలిపారు.

# అమరావతే ఎప్పటికీ మన రాజధాని

### -జగన్ మావిగన్ రాజకీయ ఎత్తుగడ -మండిపడ్డ బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

**విశాఖపట్నం,జూలై6(ఆర్ఎన్ఎ):** అమరావతే రాజధాని అని, ఇందులో అనుమానం లేదని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు గతంలో జగన్‌తో సహా అన్ని పార్టీలు ఒప్పుకున్నాయని గుర్తుచేశారు. 2019లో అధికారంలోకి రాగానే జగన్ మాట మార్చి మూడు రాజధానులు అన్నారని మండిపడ్డారు. కూటమి హయాంలో రాష్ట్ర అభివృద్ధిని చూడలేక జగన్ ఏవేవో కామెంట్స్ చేస్తున్నారని విమర్శించారు. మాటమార్చి మాట్లాడుతున్న మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో 'మావిగన్' పెడతానని జగన్ చెప్పడం దురదృష్టకరమన్నారు. ఇప్పుడు మావిగన్ అంటున్నారని.. జగన్ ఇప్పటికైనా రాజకీయ కుట్రలు మానాలని హితవుపలికారు. ఏపీ రాజధాని అమరావతిగా కేంద్రం ప్రకటించిందని... ఎప్పటికీ రాజధానిగా అమరావతే ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మావిగన్ మీద మాట్లాడాలంటే జగన్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలన్నారు. అసెంబ్లీకి రాకుండా బయట ప్రెస్‌మీట్లు పెట్టడం సరికాదన్నారు. 'సర్' పేరుతో ఓట్లను ఎక్కడా తొలగించడం లేదని వెల్లడించారు. రుషికొండ భవనాలు అద్భుతమైన ప్రాపర్టీ అని.. ఇది ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. ఈ భవనాలను కేవలం ÷వ్‌స్టార్ హోటల్‌కు ఇవ్వడం సరికాదని.. అందరికీ అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సూచించారు.

# రెండ్రోజులపాటు జగన్ పులివెందులలో పర్యటన

**కడప,జూలై6(ఆర్ఎన్ఎ):** పులివెందుల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళ,బుధ వారాల్లో పర్యటించనున్నారు. ఆయన మంగళవారం ఉదయం 11.30 గంటలకు పులివెందుల చేరుకుంటారు. అనంతరం భాకరాపురం క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలో బస చేస్తారు. బుధవారం ఉదయం పులివెందుల నుంచి బయలుదేరి ఉదయం 7.30 గంటలకు ఇడుపులపాయ చేరుకుంటారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నిర్వహించనున్న ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని నివాళులర్పిస్తారు. కార్యక్రమం అనంతరం వైఎస్ జగన్ అక్కడి నుంచి తిరుగు ప్రయాణం అవుతారు.

# దలైలామా దీర్ఘాయుష్షుతో జీవించాలి

### -ఎక్స్‌లో చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు

**అమరావతి,జూలై6(ఆర్ఎన్ఎ):** టిబెట్‌కు చెందిన బౌద్ధ మత గురువు దలైలామా పుట్టిన రోజు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. దలైలామాకు సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం పోస్ట్ చేశారు. ప్రపంచ శాంతి, మానవ హక్కుల కోసం దలైలామా కృషి ప్రశంసనీయమని కొనియాడారు. 'శాంతి, కరుణ, మానవత్వానికి దలైలామా ప్రతీక. దశాబ్దాలుగా ప్రపంచాన్ని ప్రేరేపిస్తున్న మహోన్నతుడు దలైలామా. దయ, జ్ఞానం, అహింసను ఆచరించాలని దలైలామా సందేశం ఇచ్చారు. ప్రపంచ శాంతి, మానవ హక్కుల కోసం దలైలామా కృషి ప్రశంసనీయం. దలైలామాకు సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, దీర్ఘాయుష్షు కలగాలి. శాంతి, కరుణ వ్యాప్తి చేసే దలైలామా సేవలు చిరస్మరణీయం. దలైలామా తన మహోన్నత సేవలను మరింత కాలం కొనసాగించాలి' అని ఆకాంక్షిస్తూ ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల పోరాట యోధుడు బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'సామాజిక న్యాయ సాధనకు, బడుగు బలహీన వర్గాల సాధికారతకు, సమాన అవకాశాలు కలిగిన సమసమాజ నిర్మాణానికి జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్. దేశ వ్యవసాయ రంగంలో హరిత విప్లవానికి బలమైన పునాది వేసి, ఆహార భద్రత సాధనలో విశిష్ట పాత్ర పోషించిన దూరదృష్టి గల నాయకుడు. ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్ఫూర్తిదాయక సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులర్పిస్తున్నాను' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

# కనకదుర్గమ్మకు భారీగా ఆదాయం

### -హుండీ లెక్కింపులో రూ.3 కోట్లపైగా నగదు రాక

**విజయవాడ,జూలై6(ఆర్ఎన్ఎ):** విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయం భారీగా వచ్చింది. హుండీల ద్వారా రూ.3 కోట్ల 39 లక్షల 53 వేల 599లు ఆదాయం సమకూరింది. అలాగే 568 గ్రాముల బంగారం, 3 కిలోల 330 గ్రాముల వెండితో పాటు వివిధ దేశాలకు చెందిన విదేశీ కరెన్సీని కూడా భక్తులు సమర్పించారు. 16 రోజుల హుండీ లెక్కింపును పరిశీలిస్తే రోజుకు సగటున రూ.21 లక్షల 23 వేల మేర అమ్మవారి హుండీ ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అమ్మవారి హుండీలను సోమవారం లెక్కించారు. ఈ కార్యక్రమం ఆలయ ఈవో శీనూ నాయక్ పర్యవేక్షణలో నిర్వహించారు. మొత్తం 16 రోజులకు సంబంధించిన హుండీలను లెక్కించగా భక్తులు సమర్పించిన విరాళాల ద్వారా భారీ ఆదాయం లభించింది. భక్తుల నుంచి వస్తున్న విరాళాలు కనకదుర్గమ్మపై ఉన్న అపారమైన విశ్వాసాన్ని చూపుతుందని పేర్కొన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పారదర్శకంగా పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. నగదు, బంగారం, వెండి రూపంలో భక్తులు సమర్పించిన కానుకలు ఆలయ అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు వినియోగించనున్నట్లు సమాచారం. కనకదుర్గమ్మ దర్శనానికి రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో ఆలయ ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతోంది. తాజాగా హుండీ లెక్కింపులో నమోదైన రూ.3.39 కోట్ల ఆదాయం ఆలయానికి భక్తుల నుంచి లభిస్తున్న విశేష ఆదరణకు నిదర్శనంగా నిలిచింది.

# గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు

### -సిఐ నాగరాజుకు షరతులుపై విచారణ

**విజయవాడ,జూలై6(ఆర్ఎన్ఎ):** గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో నిందితుడిగా ఉన్న సస్పెండెడ్ సీఐ నాగరాజు కస్టడీకి సంబంధించి విజయవాడ కోర్టు షరతులు విధించింది. ఈ షరతులను సవరించాలని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) దాఖలు చేసిన పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఇరువర్గాల వాదనలు పూర్తికాగా, హైకోర్టు తన తీర్పును రేపటికి రిజర్వ్ చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా ఏపీ ప్రభుత్వం తరఫున హాజరైన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీలక వాదనలు వినిపించారు. విజయవాడ కోర్టు విధించిన కొన్ని షరతుల కారణంగా దర్యాప్తు పక్రియకు ఆటంకం కలుగుతోందని ఆయన హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా నిందితుడిని ప్రశ్నించే విధానంలో విధించిన పరిమితులు దర్యాప్తు సమర్థతను ప్రభావితం చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. నాగరాజును విచారించే సమయంలో వీడియో రికార్డింగ్ నిర్వహించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. అయితే ఆడియో రికార్డింగ్ చేయడం వల్ల దర్యాప్తు గోప్యత దెబ్బతినే ప్రమాదం ఉందని, దర్యాప్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హైకోర్టుకు వివరించారు. అలాగే నిందితుడు నాగరాజును కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారించడం వల్ల ఆయన హక్కులకు ఎలాంటి భంగం కలగదని ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదించారు. దర్యాప్తు అవసరాల దృష్ట్యా ఈ విధానం సముచితమని పేర్కొన్నారు. మరోవైపు నాగరాజు తరఫు న్యాయవాది భిన్న వాదనలు వినిపించారు. తన క్లయింట్‌కు ప్రాణహాని పొంచి ఉందని, భద్రతాపరమైన కారణాల దృష్ట్యా కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారణ నిర్వహించకూడదని హైకోర్టును అభ్యర్థించారు. అన్ని రకాల సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు ఉన్న రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలోనే విచారణ చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు పూర్తిగా విన్న హైకోర్టు, ఈ అంశంపై రేపు(మంగళవారం) ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించింది. సాయికృష్ణ లాకప్ డెత్ కేసు ఏపీవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో హైకోర్టు తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

విజయవాడలో కాల్‌మనీ మళ్లీ విజృంభిస్తోంది

# ఎంపీ కేశినేని చిన్ని, అనుచరుడు మూల్పూరి కిషోర్ పాత్ర

### -సిఎం చంద్రబాబుకు మాజీ ఎంపి కేశినేని నాని లేఖ

**విజయవాడ,జూలై6(ఆర్ఎన్ఎ):** కాల్‌మనీ మళ్లీ రెక్కలు విప్పుతోందని, వెంటనే కళ్లెం వేయాలంటూ సీఎం చంద్రబాబుకు మాజీ ఎంపీ కేశినేని నాని బహిరంగ లేఖ రాశారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో క్రూరమైన కాల్ మనీ మాఫియా మళ్లీ విజృంభిస్తోందని.. ఈ మాఫియాలో ఎంపీ కేశినేని చిన్ని, అతని ప్రధాన అనుచరుడు మూల్పూరి కిషోర్ పాత్ర ఉందని లేఖలో ఆయన పేర్కొన్నారు. విజయవాడకు చెందిన మహిళా వ్యాపారవేత్త చాగర్ల గాయత్రీ రూ.5 కోట్లు అప్పు తీసుకుని.. అసలు-వడ్డీ కలిపి మొత్తం రూ. 21 కోట్లు పూర్తిగా తిరిగి చెల్లించింది. అయినా ఎంపీ కేశినేని చిన్ని, ఆయన ప్రధాన అనుచరుడు ముల్పూరి కిశోర్‌లు వేధిస్తున్నారు. బాపులపాడు మండలంలోని ఆమెకు చెందిన 11 ఎకరాల విలువైన భూమిని ఫోర్జరీ పత్రాలతో అక్రమంగా కబ్జా చేయడానికి అధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. 2015 నాటి కాల్ మనీ వ్యవహారం తరహాలోనే సీఎం తక్షణమే ఈ అధికార గర్వంతో సాగుతున్న మాఫియా సామ్రాజ్యాన్ని ఉక్కు పాదంతో అణచివేయాలి. బాధితురాలి కుటుంబానికి, ఆమె ఆస్తికి రౌండ్-ది-క్లాక్ పోలీస్ రక్షణ కల్పించాలి. విజయవాడ పౌరుల ఆస్తులకు, ప్రాణాలకు భద్రత కల్పించే వరకు సామాన్యుల తరఫున నా ఈ పోరాటం ఆగేది లేదు' అని కేశినేని నాని లేఖలో పేర్కొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# రూ.500 కోట్ల సాస్కి నిధులతో గురుకుల భవనాలు

సీఎం చంద్రబాబు నాయుడు నమ్మిన సిద్దాంతమన్నారు. అన్ని రంగాల్లోనూ రాయలసీమను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టేలా రేయింబవళ్లు కృషి చేస్తున్నారని తెలిపారు. హార్టికల్చర్, ఐటీ, పారిశ్రామిక, డిఫెన్స్, పర్యాటక, డ్రోన్ హబ్‌లుగా రాయలసీమను ముందంజలో నిలబెడుతున్నా రని అన్నారు. గడిచిన రెండేళ్లలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల్లో దాదాపు మూడో వంతు అంటే రూ.85 వేల కోట్లకు పైగా పెట్టుబడులు రాయలసీమకే వచ్చాయని మంత్రి సవిత పేర్కొన్నారు.

# ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు.. లక్ష ఉద్యోగాలు

పైగా వ్యవస్థాపకులకు ఇన్నోవేషన్ హబ్ భాగస్వామ్యం కల్పించిందని వెల్లడించారు. స్టార్టప్‌లకు సీడ్ ఫండ్, డీప్ టెక్ గ్రాంట్లు, పెట్టుబడి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. భాగస్వామ్యంతో డీప్ టెక్ ఏంజెల్ ఫండ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇండియా-కొరియా స్టార్టప్ కారిడార్ ఏర్పాటుకు కలిసి పనిచేద్దామని మంత్రి లోకేశ్ సూచించారు. కొరియన్ కంపెనీల కోసం ప్రత్యేక 'కొరియా డెస్క్' ఏర్పాటుకు ప్రతిపాదన చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టార్టప్‌లకు కొరియా మార్కెట్.. కొరియా స్టార్టప్‌లకు భారత్ మార్కెట్ ఉంటుందని చెప్పుకొచ్చారు. లాజిస్టిక్స్, ఫిన్‌టెక్, డీప్‌టెక్, అడ్వాన్స్‌డ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్‌లో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. అమరావతిలో దేశ తొలి క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అమరావతి క్వాంటం వ్యాలీలో 133 క్యూబిట్ క్వాంటం సిస్టమ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌తో స్టార్టప్‌లకు భారీ కంప్యూటింగ్ సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

# అభివృద్ధికి అడ్డుపడితే గుణపాఠం తప్పదు

వచ్చిన తర్వాత పున: ప్రారంభించామని మంత్రి తెలిపారు. వీఆర్‌సీని తలదన్నేలా మరో 15 హైస్కూల్స్‌ను ఆధునికీకరిస్తున్నామని చెప్పుకొచ్చారు. వచ్చే విద్యా సంవత్సరానికి అన్ని స్కూల్స్ సిద్ధం చేస్తామని వెల్లడించారు. వైసీపీ నేతలు వాటిపైనా విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ లబ్దికోసం, ఉనికి కోసం జగన్ అండ్ కో ఆరోపణలు చేస్తే చెడ్డవారిగా మిగిలిపోతారని హెచ్చరించారు. పరిశుభ్రతతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. మంత్రి లోకేశ్ ఆలోచనలకు అనుగుణంగా నెల్లూరులో స్కూల్స్‌ను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# వయస్సు మళ్లినా శ్రీవారిపై అచంచలమైన భక్తి

తిరుమలకు వెళ్తున్న నవనీతమ్మ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఆమె భక్తికి పలువురు ప్రశంసలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమ సోషియల్ మీడియా ఖాతాల్లో భక్తికి వయస్సు అడ్డురాలేదని, శ్రీవారిపై భక్తులకు ఉన్న విశ్వాసానికి ఈ వృద్ధురాలే నిదర్శనమని పోస్ట్ చేశారు. ఈ క్రమంలో వృద్ధురాలు, ఆమె కుటుంబ సభ్యుల వివరాలు తెలియజేయాలని టీటీడీ చైర్మన్ ఆదివారం ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు. చైర్మన్ సూచనల మేరకు టీటీడీ విజిలెన్స్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి, తమిళనాడు చెన్నైకు చెందిన నవనీతమ్మను గుర్తించి వారిని సంప్రదించారు. చైర్మన్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం నవనీతమ్మతో పాటు ఆమె కుటుంబ సభ్యులకు వీఐపీ బ్రేక్ దర్శనం ఏర్పాటు చేశారు. టీటీడీ సిబ్బంది స్వయంగా ఆమెను బయోమెట్రిక్ కేంద్రం నుంచి దర్శనం వరకు వెంట ఉండి అన్ని ఏర్పాట్లు చేశారు.అనంతరం రంగనాయకుల మండపంలో టీటీడీ ఈఓ ముద్దాడ రవిచంద్ర వృద్ధ భక్తురాలికి వేదపండితులతో వేదాశీర్వచనం చేయించి, పట్టువస్త్రం కప్పి, శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా నవనీతమ్మ మనవడు దిక్పతి మాట్లాడుతూ శ్రీవారి రూపంలో టీటీడీ అధికారులు తమ అమ్మమ్మతో పాటు కుటుంబ సభ్యులకు ఎంతో గొప్ప దర్శన భాగ్యాన్ని కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు. ఇందుకు టీటీడీ సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.


**దక్షిణ రైల్వే**

చెన్నై డివిజన్ (వర్క్స్) బ్రాంచ్)

ఇ-టెండర్ నోటీసు నెం.20/2026 తేదీ: 03.07.2026

| క్ర. నం | వస్తువు సంఖ్య | వివరణ |
|---|---|---|
| 1 | MAS20OF26093S | SR.DEN/SOUTH/MAS అధికార పరిధిలోని వివిధ ట్రాక్ పనుల కోసం 52/60 కేజీల రైళ్లకు వెల్డింగ్ భాగాల తయారీ మరియు సరఫరా. |
| 2 | MAS20OF26094C | జోన్-C1-WST-చెన్నై నగర పరిధిలో ఉన్న PWAY సెక్షన్ అయిన WST & AVD యొక్క అధికార పరిధిలోని భాగాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:-(I) MAS-AJJ సెక్షన్ VLK కి.మీ.9/30 వరకు (కలిసి) (BBQ కోచింగ్ యార్డ్, ELS/RPM మినహా) (II) MSB VLCY సెక్షన్ వేలచ్చేరి వరకు (కలిసి) (III) చెన్నై నగర పరిధిలోని ఇతర ప్రాంతాలు. |
| 3 | MAS20OF26095C | జోన్ C2- SSE/PWAY/AVD సెక్షన్‌లోని AVD కార్ షెడ్ & ZETTC-AVD మినహా అన్ని భవనాలు, సిగ్నల్ క్యాబిన్‌లు మరియు ప్లాట్‌ఫారమ్, PWAY, నీటి సరఫరా ఏర్పాట్లు, స్టేషన్ భవనాలకు ఫెన్సింగ్ మరియు వాల్లింగ్, సిబ్బంది క్వార్టర్స్, సర్వీస్ భవనాలు మొదలైన వాటి నిర్వహణ. |
| 4 | MAS20OF26096C | జోన్ C3- SSE/PWAY/AVD సెక్షన్‌లో AVD కార్ షెడ్ మరియు ZETTC AVD నిర్వహణ. |
| 5 | MAS20OF26097C | జోన్ C4-TRL-పట్టాభిరామ్ వెస్ట్ క్యాబిన్ (మినహాయించి) నుండి అరక్కోణం జంక్షన్ (మినహాయించి) 26/8 నుండి 67/18 వరకు. (తిరువళ్లూరు పి.వే మొత్తం అధికార పరిధి). |
| 6 | MAS20OF26098C | జోనల్ సి5-బిబిక్యూ కోచింగ్ యార్డ్- సర్వీస్ భవనం మరియు షెడ్ల నిర్వహణ, నీటిపారుదల ఏర్పాట్లు, రోడ్లు, పిట్‌లైన్‌లు, నడక మార్గాలు మొదలైనవి. |
| 7 | MAS20OF26099C | జోన్ C6- ఈఎల్ఎస్/రాయపురం- సర్వీస్ భవనాలు మరియు షెడ్ల నిర్వహణ, నీటిపారుదల ఏర్పాట్లు, రోడ్లు, పిట్ లైన్లు, దారి మొదలైనవి. |
| 8 | MAS20OF26100C | జోనల్ C7-SR.DEN/సెంట్రల్/MAS అధికార పరిధి BR C1,C2,C3,C4 జోన్‌లలో పనుల అమలు మరియు సామగ్రి సరఫరా. |
| 9 | MAS20OF26101C | NWL విభాగంలో మురుగునీటి పారుదల సౌకర్యాలు, వర్షపునీటి పారుదల, రోడ్లు మరియు ట్రాకింగ్ మార్గం మరియు సంక్షేమ భవనాల మరమ్మతులు మరియు మెరుగుదల. |

టెండర్ల ప్రారంభ తేదీ మరియు సమయం: 27.07.2026 ఉదయం 11:30 గంటలకు.

పూర్తి వివరాలు మరియు టెండర్ పత్రం http://www.ireps.gov.in లో లభిస్తాయి.

డివిజనల్ రైల్వే మేనేజర్/వర్క్స్/చెన్నై-03

# మాది రైతు సంక్షేమ ప్రభుత్వం

**- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు**



**చిత్తూరు,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 'అన్నదాతల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి సర్కార్ పనిచేస్తోంది. 4 రూపాయల సబ్సిడీని ప్రకటించి, మామిడి రైతులకు దన్నుగా నిలిచి, చిత్తశుద్ధిని నిరూపించుకుంది. రైతన్నల సమస్యలను పరిష్కరించేందుకు పటిష్ట చర్యలు చేపట్టింది. అందుకే మాది రైతు సంక్షేమ ప్రభుత్వం' అని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కొనియాడారు. పని చేస్తున్న కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీరును, సోమవారం ఉదయం చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు విలేకరుల సమావేశంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఖండించారు. మామిడి రైతుల కష్టాన్ని గుర్తించి ముందు చూపుతో నాలుగు రూపాయల సబ్సిడీని ప్రకటించి, అన్నదాతకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం కూటమి సర్కార్ అని ప్రశంసించారు. రైతన్నల పక్షపాతిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి నిరూపించారన్నారు. ఇది సీఎం చంద్రబాబు పాలనా దక్షతకు నిలువెత్తు నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వ పాలనను చూసి ఓర్వలేకనే.., వైసిపి నేతలు నిరసనల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఈరకమైన కార్యక్రమాలకు పూనుకుందని తప్పుబట్టారు. మామిడి రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 281 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా లేఖ రాశారని గుర్తు చేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.., కేంద్ర వ్యవసాయశాఖ స్పందించి, తోతాపురి మామిడి ధరలు పడిపోవడానికి గల కారణాలను గుర్తించి, ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించడానికి కేంద్రం ఐసీఏఆర్ ప్రత్యేక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ నేపథ్యం లో గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతు న్నారంటూ ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మామిడి రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన ఘనత వైకాపాదే అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో నడుస్తున్న కూటమి ప్రభుత్వం.., రైతుల సంక్షేమం కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక పథకాలను సాధించి అమలు చేస్తోందన్నారు. రైతన్నల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అహర్నిశలు శ్రమిస్తోందని ఆయన స్పష్టం చేశారు. కాగా ఈ సమావేశంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి అశోక్ కుమార్, ఏపీ మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ బాబు పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లా

## అమరావతికి బయలుదేరిన సీఎం చంద్రబాబు

**కుప్పం,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 3 రోజుల పాటు కుప్పం నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం తన పర్యటనను ముగించుకుని అమరావతికి బయలుదేరారు. కుప్పం నియోజకవర్గంలోని హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సుమిత్ కుమార్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పి.ఎస్. మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పలమనేరు-కుప్పం-మదనపల్లి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డా.సురేష్ బాబు, రెస్కో చైర్మన్ ప్రతాప్, ఏఎంసీ చైర్మన్ జి.ఎం. రాజు, తుషార్ దూడి, కేడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆదర్శ్ రాజేంద్రన్, ట్రైనీ కలెక్టర్ వెంకటేష్, డీఎఫ్వో సుబ్బరాజు, కూటమి నాయకులు తులసీనాథ్, నరేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం 11.05 గంటలకు తుంసీ హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్లో ముఖ్యమంత్రి అమరావతికి బయలుదేరారు.

## ఘనంగా డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి




**పలమనేరు, జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలి. ఆనంద బాబు భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై-భారత్ చిత్తూరు సంజీవని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, గొప్ప దేశభక్తుడు, ప్రముఖ విద్యావేత్త డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్ పలమనేరు అధ్యక్షులు, బైరెడ్డిపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ), కె. ఆనంద బాబు మాట్లాడుతూ డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ దేశ సమగ్రత, జాతీయ సమైక్యత, దేశభక్తి విలువలను బలోపేతం చేయడంలో విశేష కృషి చేశారని కొనియాడారు. యువత విద్యతో పాటు క్రమశిక్షణ, సేవాభావం, జాతీయతను అలవర్చుకొని దేశాభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సమాజ సేవ పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, కేంద్ర ప్రభుత్వం మై భారత్ ద్వారా యువత కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని సంజీవని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యు.ఎస్. ఉమా మహేష్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కన్నయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, మై భారత్ ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, సంజీవని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, యువజన ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శివాలయంలో ప్రత్యేక పూజలు



**పలమనేరు, జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో ప్రసిద్ధిగాంచిన కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ఉదయం గంటవూరు గ్రామానికి చెందిన బావిష్, రామకృష్ణ వీరి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో కాశీ విశ్వేశ్వర స్వామి గుడి చైర్మన్ మురళీకృష్ణ, బాబు తోపాటు గుడి డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాలు, పోషకాహారంపై ప్రత్యేక దృష్టి

**- నాగమంగళం ఎంపీపీ పాఠశాలను సందర్శించిన ఎంఈఓ పి.లీలారాణి**



**పలమనేరు,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని నాగమంగళం ఎంపీపీ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి పి.లీలారాణి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల అభ్యాస ప్రమాణాలు, వర్క్‌బుక్‌ల దిద్దుబాట్లు, స్కూల్ రెడినెస్ కార్యక్రమం అమలు, అకాడమిక్ రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యాస ఫలితాలు మరింత మెరుగుపడేలా ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా బోధన నిర్వహించాలని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి, భోజనం నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలు, వంటశాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందేలా ఎల్లప్పుడూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన పీనట్-మిల్లెట్ చిక్కీస్ పంపిణీని పరిశీలించారు. వేరుశెనగలు, చిరుధాన్యాలు (రాగి, జొన్న, సజ్జలు తదితర మిల్లెట్లు), బెల్లంతో తయారైన ఈ పోషకాహార చిక్కీలు విద్యార్థులకు అవసరమైన ప్రోటీన్లు, ఐరన్, కాల్షియం, ఫైబర్ శక్తిని అందిస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో పోషకాహారలోపాన్ని తగ్గించడం, ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తోడ్పడడం, చిరుధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పీనట్-మిల్లెట్ చిక్కీస్‌ను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఎంఈఓ, వారి చదువుపై ఆసక్తి, అభ్యాస స్థాయిని తెలుసుకొని మరింత కృషి చేయాలని ప్రోత్సహించారు. అలాగే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రభుత్వం అమలు చేస్తున్న విద్య, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రతి విద్యార్థి సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

## రైతుల సమస్యలపై సమగ్ర చర్చ

**- మార్కెట్ కమిటీ సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి**



**పలమనేరు,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మార్కెట్ యార్డులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రైతు ప్రతినిధులు, మండి నిర్వాహకులు సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి మార్కెట్ వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. రైతులు మార్కెట్ యార్డులో తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి షెడ్లు వంటి కనీస వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. టమాటా బాక్సుల తూకంలో మోసాలు జరగకుండా ప్రతి మండిలో ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషిన్లు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం నిర్ణయించిన 4 శాతం కమీషన్ మాత్రమే మండి యజమానులు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు తీసుకొచ్చిన పంటకు వెంటనే వేలం నిర్వహించి, చెల్లింపులు అదే రోజు లేదా నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని కోరారు. హమాలీ, లోడింగ్, అన్‌లోడింగ్ ఛార్జీలను నియంత్రించి రైతులపై అదనపు భారం పడకుండా చూడాలని, దళారుల జోక్యాన్ని అరికట్టి రైతులు నేరుగా కొనుగోలుదారులకు విక్రయించే అవకాశం కల్పించాలని సూచించారు. అదేవిధంగా పంట నిల్వ కోసం కోల్డ్ స్టోరేజ్, గిడ్డంగులు ఏర్పాటు చేయాలని, మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పారదర్శకత పెంచాలని, వర్షాకాలంలో పంట తడవకుండా షెడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. రైతుల ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్, ఫిర్యాదు రిజిస్టర్ ఏర్పాటు చేయాలని రోజువారీ ధరలను నోటీస్ బోర్డులో తప్పనిసరిగా ప్రదర్శించాలని, ప్రతి నెల రైతులతో సమీక్షా సమావేశాలు నిర్వహించాలని ఏఎంసీ చైర్మన్ రాజన్నకు ఏఎంసి సెక్రటరీ వి.సంజీవ్ కుమార్‌ను కోరారు. కూరగాయల విక్రయాల కోసం ప్రత్యేక స్థలం కేటాయించి, బారికేడ్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. అలాగే ప్రతిపాదిత 33 ఎకరాల శాశ్వత మార్కెట్ యార్డు పూర్తయ్యే వరకు ప్రైవేట్ స్థలంలో అయినా మార్కెట్ నిర్వహించాలని సూచించారు. ఈ అంశాలన్నింటిపై స్థానిక ఎమ్మెల్యే అమర్నాథరెడ్డితో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని నిర్ణయించారు. మండి యజమానులు రైతు ప్రతినిధులతో కూడిన బృందం ఎమ్మెల్యేను కలిసి రైతుల సమస్యలను వివరించి, త్వరితగతిన సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## బోయకొండ గంగమ్మను దర్శించుకున్న ఎంపీ మిథున్ రెడ్డి



**చౌడేపల్లి, జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం ఆయనకు పూర్ణకుంభం పట్టి ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద మండపంలో వేద ఆశీర్వాదం అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలు మెమొంటోతో సత్కరించారు. అనంతరం ఆయన పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు .బోయకొండ గంగాపురం ఆర్ఆర్ కాలనీలకు చెందిన బాల గంగిరెడ్డి ప్రసాదు, జీవీఎస్ రమణ తదితర వైసిపి నాయకుల కోరిక మేరకు వారి ఇండ్లకు వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు. అంతకుముందు బోయకొండ భవాని నగర్‌లో నాయకులు కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి గజమాలవేసి బాణా సంచాలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు నాగభూషణ రెడ్డి, రాష్ట్ర వైకాపా ఉపాధ్యక్షుడు దామోదర్ రాజు ,మహిళా కార్యదర్శి రుక్మిణమ్మ, మండల ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, నరసింహులు యాదవ్, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకరనారాయణ, ధర్మకర్త పవన్ రాయల్, వైకాపా రాష్ట్ర యువజన అధ్యక్షుడు మిద్దింటి కిషోర్ బాబు, రాష్ట్ర విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్ అనుప్రియ, మాజీ ఎంపీపీ కూరపర్తి అంజిబాబు, లడ్డు రమణ, జంగాలపల్లి రమణ, ఓదులుపేట శేషాద్రి, శ్రీరామ్, భారత్ ,వరుణ్, అరుణ్ కుమార్, షంషీర్, గిరి, అల్తాఫ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్‌పై అన్ని పార్టీ నాయకులతో సమీక్ష

**పెద్దపంజాణి,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎస్ఐఆర్ 2026 ప్రక్రియలో భాగంగా మండలంలోని అన్ని పార్టీల నాయకులతో తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించినట్లు తహసిల్దార్ రామ్మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ 2026లో భాగంగా ప్రతి ఒక్క ఓటరు 8 రోజులలోగా వారికి ఇచ్చిన ఎన్రోల్మెంట్ ఫారాలను బిఎల్‌వోల దగ్గర చేర్చాలని చెప్పారు. దీనికి అన్ని పార్టీల నాయకులు సమన్వయంతో వ్యవహరించి బిఎల్ఓ లకు సహకరించి ఎస్ఐఆర్ 2026ను మండలంలో నూరు శాతం అమలయ్యేలా చేయాలన్నారు. మండలంలో ఇప్పటివరకు 76 శాతం ఎన్రోల్మెంట్ పూర్తయిందని సహాయ ఎన్నికల అధికారి, తహసిల్దారు రామ్మూర్తి తెలిపారు.

## విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి



**పెద్దపంజాణి,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని అమ్మ రాజు పల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు హరినాథ్ రెడ్డి భార్య రోజు మాదిరిగానే వ్యవసాయ పొలం వద్ద ఆవును మేతకు కట్టి కొంత దూరం రాగా విద్యుత్ వైర్లు తెగి ఆవు మీద పడడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే ఆవు మృతి చెందింది. పాడి ఆవు విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వ పరంగా తనను ఆదుకోవాలని రైతు హరినాథ్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

## కడపపై నెల్లూరు ఘన విజయం..

**జెస్సికా అజేయ సెంచరీ**

**వాల్మీకిపురం,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సౌత్ జోన్ ఉమెన్స్ అండర్-19 వన్‌డే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం వాయల్పాడు సీడీసీఏ-జీవీఎస్‌సీఎస్ గ్రౌండ్స్‌లోని గ్రౌండ్-2లో కడప, నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన కడప జట్టు తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 239 పరుగులు చేసింది. జి. నీతిష 86 బంతుల్లో 66 పరుగులు చేయగా, వి.ఎస్. తనుశ్రీ 99 బంతుల్లో 80 పరుగులతో రాణించింది. జి. హరిణి 62 బంతుల్లో 41 పరుగులతో, ఎ. పశ్యంతి శ్రీ 32 బంతుల్లో 26 పరుగులతో అజేయంగా నిలిచారు. నెల్లూరు బౌలర్లలో జి.వి. శారద రేష్మ 2 వికెట్లు పడగొట్టగా, శ్రావణ వైష్ణవి, ఎం.కె. నికిత తలో వికెట్ తీశారు. 240 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 43.4 ఓవర్లలో లక్ష్యాన్ని చేరుకుంది. కె. జెస్సికా అద్భుత బ్యాటింగ్‌తో 150 బంతుల్లో 137 పరుగులు చేసి అజేయ సెంచరీ నమోదు చేసి జట్టు విజయానికి ప్రధాన కారణమైంది. ఎ. సాహర్ 65 బంతుల్లో 40 పరుగులతో ఆమెకు చక్కటి సహకారం అందించింది. కడప బౌలర్లలో వి.ఎస్. తనుశ్రీ, ఎ. పశ్యంతి శ్రీ తలో వికెట్ సాధించారు.

## బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్‌ను కలిసిన ఇంజినీరింగ్ కళాశాల వీసీ



**కుప్పం,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్-చైర్మన్ డా.ఎన్.సునీల్ రాజ్ సోమవారం హైదరాబాద్‌లోని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ కార్యాలయంలో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, కుప్పం ఇంజినీరింగ్ కళాశాల మధ్య విద్యార్థుల మార్పిడి (స్టూడెంట్ ఎక్స్ఛేంజ్) కార్యక్రమాలను ప్రారంభించే అవకాశాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యా అనుభవం, పరిశోధన అవకాశాలు, ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం అందించే అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాల నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తూ విజయవంతంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం పట్ల బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ అభినందనలు తెలియజేస్తూ, కళాశాల విద్యా ప్రగతిని ప్రశంసించారు. డా.ఎన్.సునీల్ రాజ్ బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్‌ను ఘనంగా సన్మానించి, కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ప్రాస్పెక్టస్‌ను అందజేశారు. ఈ సమావేశం రెండు దేశాల విద్యాసంస్థల మధ్య విద్యా సహకారానికి కొత్త అవకాశాలను తెరచే దిశగా కీలక అడుగుగా నిలుస్తుందని కళాశాల వర్గాలు పేర్కొన్నాయి.

## రాజమండ్రి రైతు బజార్‌కు 10 టన్నుల టమోటాల సరఫరా

**పలమనేరు,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశముల మేరకు, ప్రాంతీయ సంయుక్త మార్కెటింగ్ సంచాలకులు, కడప వారి ఆదేశాలు సహాయ మార్కెటింగ్ సంచాలకులు, చిత్తూరు వారి సూచనల మేరకు పలమనేరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఆధ్వర్యంలో 10 టన్నుల టమోటాలను రాజమండ్రి రైతు బజార్‌కు పంపించారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా, స్థానిక మార్కెట్‌లో ధరలు పతనం కాకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాజన్న, కార్యదర్శి వి. సంజీవ్ కుమార్, డైరెక్టర్లు శంకరప్ప, సుబ్రహ్మణ్యం, నదీమ్, కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాబూజీ ఆశయ సాధనే నిజమైన నివాళి

**- పీలేరులో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి**

**పీలేరు,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కుల రహిత సమాజ నిర్మాణం, సామాజిక సమానత్వం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విశేష కృషి చేసిన దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం పీలేరులో దళిత నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు సామాజిక న్యాయం, సమానత్వం, దళితుల హక్కుల పరిరక్షణ కోసం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితాంతం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సముచిత గుర్తింపు, అవకాశాలు కల్పించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. వ్యవసాయ, రక్షణ, రైల్వే శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో దేశాభివృద్ధికి దోహదపడే అనేక సంస్కరణలను అమలు చేశారని, ఆయన దూరదృష్టి, పరిపాలనా సామర్థ్యం భారత రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. ప్రజలందరికీ "బాబూజీ"గా ఆప్యాయంగా నిలిచిన ఆయన సేవలు, త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో కుల వివక్ష పూర్తిగా రూపుమాపి, సమానత్వ విలువలను ఆచరణలోకి తీసుకురావడమే డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్‌కు అందించే నిజమైన నివాళి అని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నడిమికండ్రిగ సుధాకర్ బాబు, తుమ్మల ధరణ్ కుమార్, నగరిమడుగు సుభాష్, జెట్టి మల్లికార్జున, కొత్తపేట ప్రసాద్, సద్దల శ్రీకాంత్, బోయిని చంద్రశేఖర్, తెరకాల్ల కృష్ణయ్య పాల్గొని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు.

## శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన



**రాయచోటి, జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్-ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం మత్తుపదార్థాల వినియోగ నివారణ, రోడ్డు భద్రత, ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయచోటి ట్రాఫిక్ విభాగపు సీఐ పి.వి. సుధాకర్ రెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సీనియర్, జూనియర్ విద్యార్థులు పరస్పరం స్నేహభావంతో మెలగాలని, ర్యాగింగ్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని, విద్యాభ్యాసంతో పాటు భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు. యువత గంజాయి, కొకైన్, హెరాయిన్, గుట్కా, పొగాకు, మద్యం వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, వాటి వల్ల శారీరక, మానసిక, ఆర్థిక నష్టాలతో పాటు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. మత్తుపదార్థాల వినియోగం రోడ్డు ప్రమాదాలు, నేరాలు, కుటుంబ సమస్యలకు ప్రధాన కారణంగా మారుతుందని వివరించారు. ర్యాగింగ్ నిరోధక చట్టం ప్రకారం నేరం రుజువైతే ఆరు నెలల నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు రూ.5,000 నుంచి రూ.50,000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ర్యాగింగ్, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై దృశ్యరూపంలో అవగాహన కల్పించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ర్యాగింగ్ అనే విష సంస్కృతిని ప్రతి విద్యార్థి బహిష్కరించి క్రమశిక్షణతో విద్యలో రాణించాలని పిలుపునిచ్చారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ట్రాఫిక్ ఎస్సై ఎన్.శేఖర్ మాట్లాడుతూ మత్తుపదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి విద్యార్థి బాధ్యతగా కృషి చేయాలని కోరారు. ప్రతి విద్యార్థి చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించాలనిసూచించారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులతో ర్యాగింగ్, మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకటరమణ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఏ. నరేష్, మేనేజ్‌మెంట్, ప్లేస్‌మెంట్స్ విభాగాధిపతి డాక్టర్ కె. ఇంతియాజ్, ఏఐ, డీఎస్ విభాగాధిపతి పి. సుబహాన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి వి.ప్రతాప్ రావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి పి.శ్రావణ్ కుమార్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి బి.సౌజన్య, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఏ. కరుణాకర్, బేసిక్ సైన్సెస్, హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఏ. రాజేష్, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు చర్యలు: జిల్లా ఎస్పీ



మదనపల్లె, జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి బాధితుల నుండి అర్జీలను స్వీకరించారు. బాధితులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ఎస్పీ తక్షణమే చట్టప్రకారం న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని, తీసుకున్న చర్యల నివేదికను వెంటనే కార్యాలయానికి సమర్పించాలని స్పష్టం చేశారు.జిల్లా కేంద్రానికి రాలేని వారు తమ పరిధిలోని స్థానిక పోలీస్ స్టేషన్లలోనే నేరుగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.స్థానిక పోలీసు స్టేషన్లలో ఇచ్చే అర్జీలను కూడా పీజీఆర్ఎస్ కిందనే పరిగణించి,ప్రజలకు సత్వర న్యాయం అందిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు.

## పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో పరిష్కారం చూపాలి

**- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



మదనపల్లె,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి): పిజిఆర్ఎస్ అర్జీలు సకాలంలో నాణ్యతతో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తోపాటు.. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్డిసి మాధవ కృష్ణారెడ్డి, డిఎల్డిఓ లక్ష్మీపతిలు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ ల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అర్జీలను వేగవంతంగా, నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలని, గ్రీవెన్స్ పై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను గడువులోపు అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్వహించే ఐవిఆర్ఎస్ కాల్స్ నందు పాజిటివ్ పర్సెంటేజ్ (సానుకూల స్పందన) ప్రజల నుండి సేకరించే అభిప్రాయాలలో పురోగతి సాధించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన పనితీరుపై దృష్టి పెట్టి రాష్ట్రంలో జిల్లాను మెరుగైన స్థానంలో ఉండేలా కృషి చేయాలని తెలిపారు.అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 275 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకుని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికలకు ప్రాథమిక ఉచిత ఆరోగ్య సేవలు: డాక్టర్ చంద్రశేఖర్



పీలేరు, జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):నేటి వ్యాధులు లేని బాలిక రేపటి మేలైన ప్రతిభకు మూలం అని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ బాలికలకు భరోసా ఇచ్చారు. పాఠశాల ఆరోగ్య విద్య కార్యక్రమంలో భాగంగా పీలేరు పట్టణం లోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహములో ఉచిత వైద్య ఆరోగ్య సేవలు వారి బృందంతో కలిసి ఇచ్చారు. డాక్టర్ చంద్రశేఖర్ పిల్లలతో మాట్లాడుతూ విద్యార్థుల్లో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి మంచి జీవన నైపుణ్యాలతో పాటు, కన్ను, చెవి, గొంతు, దంత సంరక్షణకై ముందస్తు అవగాహన అవసరమని, తీసుకునే పిండి పదార్థాలు, మాంసకృతులు, క్రొవ్వులు, విటమిన్‌లు, మినరల్స్ లభ్యమయ్యే ఆహార పదార్థాలు విరివిగా తీసుకోవాలని, ఇవన్నీ మీ వసతి గృహములో తీసుకునే ఆహారపదార్థాల్లో విరివిగా లభ్యమవుతాయని డా:చంద్రశేఖర్ బాలికలకు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఓ కొండయ్య, పర్యవేక్షకుల నాగమ్మ, లక్ష్మి ఏఎన్ఎం, రెడ్డెప్ప, సిహెచ్ఓ చంద్రకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశసమైక్యతకు డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ కృషి చిరస్మనీయం

మదనపల్లె, జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 155వ బూత్ పరిధిలో సోమవారం బూత్ అధ్యక్షులు బర్నేపల్లె రవికుమార్ అధ్యక్షతన శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ అజ్మతుల్లా ఖాన్, బర్నేపల్లి రవి కుమార్, విజయ్, సీనియర్ నాయకులు నాగరాజు, హరికృష్ణ, మధు, ఆది నారాయణలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా దేశ సమైక్యత, జాతీయత కోసం ఆయన చేసిన సేవలను నాయకులు కొనియాడారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## స్కేటింగ్‌లో రికార్డులు సృష్టించనున్న మదనపల్లె బుడతడు

**-'వీర్ జవాన్'లకు నివాళిగా నాన్-స్టాప్ 79 కిలోమీటర్ల మారథాన్**



మదనపల్లె,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి): ఆ చిన్నారి అడుగులు అద్భుతాలు సృష్టించనున్నాయి. చేతిలో జాతీయ జెండా పట్టుకుని, గుండె నిండా దేశభక్తిని నింపుకుని ఆ బాలుడు చేసే సాహసం సరికొత్త చరిత్రకు వేదిక కానుంది. భారత సాయుధ దళాల ధైర్యసాహసాలు, త్యాగాలకు నివాళిగా మదనపల్లెకు చెందిన 'దక్షిత్' అనే 3 సంవత్సరాల మూడు నెలల బుడతడు స్కేటింగ్‌లో అరుదైన ప్రపంచ రికార్డు ఘనతను సాధించేందుకు సిద్ధమవుతున్నాడు.

**మదనపల్లె టు కదిరి.. నాన్-స్టాప్ రికార్డు!**

"ఒక చిన్నారి.. ఒకే కల.. ఒకే నివాళి.. ఒకే చరిత్ర" అనే నినాదంతో దక్షిత్ సుదీర్ఘ మారథాన్‌ను చేయనున్నాడు. 79 వ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మదనపల్లె నుంచి కదిరి వరకు ఉన్న 79 కిలోమీటర్ల దూరాన్ని ఎలాంటి విరామం లేకుండా పూర్తి చేసి అందరినీ ఆశ్చర్యపరచనున్నాడు.దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ప్రాణాలర్పించిన వీర జవాన్ల జ్ఞాపకార్థం ఈ రికార్డును అంకితం ఇవ్వనున్నాడు. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ దేశవ్యాప్తంగా స్ఫూర్తిని నింపేలా సాగే ఈ ప్రయాణంలో దక్షిత్ మదనపల్లె కీర్తి పతాకాన్ని సగర్వంగా ఎగురవేసి ప్రపంచ స్థాయి రికార్డులు సాధించనున్నాడు. ఇప్పటికే ట్రయల్ స్కేటింగ్ పూర్తిచేసిన దక్షిత్ క్రీడా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డిని కలిసినట్లు తెలిపాడు. సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె కలెక్టరేట్లో, జిల్లా క్రీడల అధికారి చంద్రశేఖర్ తో కలిసి కలెక్టర్ నిశాంత్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నాడు. ఆగస్టు 14న తాను చేయనున్న స్కేటింగ్ కు సంబంధించి వివరాలను తెలియజేశాడు.

## ఏఎఫ్ఏసి క్యాంపులో మిట్స్ వర్సిటీ విద్యార్థి అద్వితీయ ప్రతిభ

**- అభినందించిన ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి**



మదనపల్లె/ కురబలకోట, జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఎన్‌సీసీ ఎయిర్ వింగ్‌కు చెందిన క్యాడెట్ జి.రుద్రతేజ భారత వైమానిక దళం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఎయిర్ ఫోర్స్ అటాచ్‌మెంట్ క్యాంప్ (ఏఎఫ్ఏసి)ను విజయవం తంగా పూర్తిచేసి విశిష్ట ప్రతిభ కనబరిచాడని వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ జాతీయ స్థాయి శిక్షణను హైదరాబాద్‌లోని డుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా క్యాడెట్ రుద్ర తేజకు భారత వైమానిక దళం కార్యకలాపాలు, యుద్ధ, శిక్షణ విమానాల పరిచయం, విమానయాన సాంకేతిక అంశాలు,సైనిక క్రమశిక్షణ,నాయకత్వ వికాసం, జట్టు భావన, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై సమగ్ర శిక్షణ పొందారన్నారు. అలాగే భారత వైమానిక దళ అధికారులతో ప్రత్యక్షంగా మమేకమై వారి అనుభవాలను తెలుసుకునే అవకాశం పొందారని తెలిపారు. దేశ నలుమూలల నుండి 100 మందికిపైగా పాల్గొన్న ఈ శిక్షణలో మిట్స్ యూనివర్సిటీ క్యాడెట్ ప్రతిభ చూపడం గర్వకారణమన్నారు. ఈ జాతీయ స్థాయి శిక్షణా శిబిరం ఎయిర్‌ఫోర్స్ అటాచ్‌మెంట్ క్యాంప్ కమాండెంట్ వింగ్ కమాండర్ ఆర్యన్ ఆధ్వర్యంలో నిర్వహించబడిందని ఆయన తెలిపారు. జాతీయస్థాయి శిక్షణా కార్యక్రమంలో ప్రతిభ చూపిన క్యాడెట్ జి.రుద్రతేజను మిట్స్ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ప్రో ఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, వైస్-ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్, ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ కేర్ టేకింగ్ ఆఫీసర్ చరణ్ కూచి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

## అమరావతి ఛాంపియన్‌షిప్-2026' ప్రచార పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్




మదనపల్లె, జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న 'అమరావతి ఛాంపియన్‌షిప్-2026' ప్రచార పోస్టర్లను సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఈ ప్రతిష్ఠాత్మక ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, చెస్, హాకీ, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, యోగా తదితర మొత్తం 12 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.జూలై 15 నుంచి ఆగస్టు 26 వరకు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్-17, అండర్-23 విభాగాల్లో బాలురు, బాలికలకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అర్హులైన క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్డిసి మాధవ కృష్ణారెడ్డి, డి ఎల్ డి ఓ లక్ష్మీపతి, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జి. చంద్రశేఖర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఎంపీ మిథున్ రెడ్డి వద్దకి చేరిన ఎస్ఐఆర్ నివేదిక



మదనపల్లె,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి): రాజంపేట పార్లమెంట్ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి మదనపల్లె ఎస్ఐఆర్ నివేదికను నియోజకవర్గం సమన్వయకర్త ఎస్.నిసార్ అహమద్ సమర్పించారు. సోమవారం సదుం మండలంలోని యర్రాతివారిపల్లెలో మాజీ మంత్రి, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, యువ పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డిని, తంబళ్లపల్లె శాసనసభ్యులు ద్వారకానాథ రెడ్డిని నిసార్ అహమద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా మదనపల్లె నియోజకవర్గంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియకు సంబంధించి సమగ్ర నివేదికను ఎంపీ మిథున్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యేందుకు సమయం చాలా తక్కువగా ఉన్నందున డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసేలా సంబంధిత అధికారులకు పార్టీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు పూర్తిస్థాయిలో సహకరించాలని సూచించారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలన్నారు. ఎవరు ఓటు హక్కును కోల్పో కుండా అప్రమత్తంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్.రెడ్డి, మదనపల్లె మండల కన్వీనర్ డి.కరుణాకర్ రెడ్డి, పార్టీ నాయకులు మొహమ్మద్ యూనస్ తదితరులు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

## రిజిస్ట్రేషన్ శాఖ ప్రైవేటీకరణను విరమించుకోవాలి

**- దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం డిమాండ్**



మదనపల్లె,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి): ప్రజల ఆస్తులకు భద్రత కల్పించడంతో పాటు, రిజిస్ట్రేషన్ శాఖ సేవలను ప్రైవేటుపరం చేసే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమిం చుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం, మదనపల్లె డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షులు రంగు గుణశేఖర్, కార్యదర్శి కంగేరి నందా.. కమిటీ సభ్యులతో కలిసి.. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మదనపల్లె కలెక్టరేట్లో నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి సమస్యలు పరిష్కరించాలని పిజిఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. దస్తావేజు లేఖనం అనేది ఎంతో పవిత్రమైన వృత్తి అని, దీనిపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల తమ ఉపాధి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తులకు పూర్తి భద్రత కల్పించాలని, వివాదాస్పదంగా మారిన జీ.ఓ.ఎం.ఎస్.నెం. 396 ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దస్తావేజులేఖర్ల సంఘం మదనపల్లె కమిటీ సభ్యులు మంచినీళ్ల నాగ మునీంద్ర, రంగు రాజేంద్ర, రెడ్డప్ప, లవాని మహమ్మద్ ఖాన్, కరూర్ వెంకటేష్, శ్రీ రామయ్య గుప్తా, సాయిరాం, మచ్చా నారాయణ, చంద్రశేఖర్, సాయి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- సింగల్ విండో చైర్మన్ గుత్తికొండ త్యాగరాజు**



ములకలచెరువు,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని సింగల్ విండో చైర్మన్ గుత్తికొండ త్యాగరాజు తెలిపారు. సోమవారం ములకల చెరువు మండలం దేవుల చెరువు పంచాయతీలో ప్రభుత్వం సరఫరా చేసిన సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల బస్తాలను వ్యవసాయ వ్యవసాయ అధికారి స్రవంతితో కలిసి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా గుత్తికొండ త్యాగరాజు మాట్లాడుతూ రైతులకు అన్ని విధాల అండగా కుటుంబ ప్రభుత్వం ఉంటుందన్నారు. ఖరీఫ్లో రైతులు వేరుశనగ పంట సాగు చేసుకునేందుకు ముందస్తుగా రైతు భరోసా కిసాన్ నిధులను ప్రభుత్వం విడుదల చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా సబ్సిడీలో పరికరాలతో పాటు, యూరియాను సబ్సిడీలో రైతులకు అందించి రైతుల పక్షపాతిగా కూటమి ప్రభుత్వం నిలబడిందన్నారు. వ్యవసాయ అధికారి స్రవంతి మాట్లాడుతూ రైతులు పంట సాగు చేసుకునేందుకు సబ్సిడీలో వేరుశనగ విత్తన కాయలు కంది గింజలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో రైతులకు వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శివారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, బూతు కన్వీనర్ చంద్రశేఖర్, రషీద్, బసివి శ్రీన, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నాయునిచెరువుపల్లిలో మొహరం వేడుకలు



ములకలచెరువు, జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి): మండలంలోని నాయుని చెరువుపల్లిలో ఘనంగా మొ హరం వేడుకలు జరుగుతు న్నాయి. 10 రోజులపాటు నిర్వహించే ఈ మొహరం వేడుకలు 9వ రోజు పీర్లకు పూలతో అలంకరించి డప్పుల వాయిద్యాల మధ్య ఊరేగిం పులు నిర్వహించారు. అగ్నిగుండం ఏర్పాటు చేసి చుట్టూ డబ్బుల వాయిద్యాల మధ్య చిన్న పెద్ద తేడా లేకుండా చిందులు వేశారు. పదవ రోజు మంగళవారం పీర్లకు జెల్లిది నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ సంధ్యా జనార్దన్ రెడ్డి తెలిపారు. జనసేన పార్టీ తంబళ్లపల్లి నియోజకవర్గ ఇన్చార్జి పోతుల సాయినాథ్‌లు తెలిపారు. మొహరం వేడుక సందర్భంగా ఈ వేడుకలు చూసేందుకు బంధువులు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, కోటకొండ వెంకటేష్, సోము, అంజాద్, నాగిరెడ్డి, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఏనుగుల బీభత్సంతో రూ.3 లక్షలు ఆస్తి నష్టం



కె.వి పల్లి, జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి): అన్నమయ్య జిల్లా, కె.వి.పల్లి మండలంలోని నూతన కాలువ పంచాయతీ పరిధిలో దారి తప్పిన ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. గురకంపల్లి, ఉప్పుతోల నాగయ్య కుమారుడు ఉప్పుతోళ్ల వెంకటరమణ పొలములో ప్రాంతాల్లో సంచరించిన ఏనుగులు రైతుల టెంకాయ చెట్లు 30 వరి పంట పొలాల్లోకి చొరబడి తీవ్ర నష్టం కలిగించాయి. స్థానికుల కథనం ప్రకారం, ఏనుగులు బొప్పాయి చెట్లు విరగొట్టడంతో పాటు టెంకాయ చెట్లను నేలకూల్చాయి. పొలాలకు ఏర్పాటు చేసిన బోరు ధ్వంసం చేసి, నీటి సరఫరా కోసం వేసిన పైపులను తొక్కేయడంతో అవి విరిగిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే సాగు ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ఈ ఘటన మరింత నష్టాన్ని మిగిల్చిందని బాధిత రైతులు వాపోతున్నారు. ఏనుగుల సంచారం కారణంగా గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో పొలాల వద్దకు వెళ్లేందుకు కూడా జంకుతున్నామని, ఏనుగులు ఇంకా సమీప అటవీ ప్రాంతాల్లోనే సంచరిస్తున్నాయనే భయంతో అప్రమత్తంగా ఉన్నామని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని నష్టాన్ని పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు సేకరించి, పంటలు, తోటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నారు. అలాగే ఏనుగుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచి, వాటిని సురక్షితంగా అటవీ ప్రాంతానికి మళ్లించే చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. అటవీ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం, దారి తప్పిన ఈ గుంపులో సుమారు ఆరు నుంచి ఎనిమిది ఏనుగులు ఉన్నట్లు భావిస్తున్నారు. గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని, ఏనుగులు కనిపించిన వెంటనే అటవీ శాఖకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. రైతులకు జరిగిన నష్టంపై ప్రభుత్వం తగిన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని బాధితులు వెంకటరమణ కోరుతున్నారు.

## ముగ్గురు పిల్లలున్న జంటలకు 5 వేల నజరానా

**అమరావతి,జులై6(ఆర్ఎన్ఎ):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జనాభా సమతుల్యతను కాపాడటం, కుటుంబ సంక్షేమాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఒక వినూత్న నిర్ణయాన్ని తీసుకుంది. రాష్ట్రంలో ఎక్కువ సంతానాన్ని ప్రోత్సహించేలా సరికొత్త నగదు బహుమతులను, ప్రోత్సాహకాలను ప్రకటిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. దక్షిణాది రాష్ట్రాల్లో మారుతున్న జనాభా రేటు, వృద్ధుల సంఖ్య పెరుగుతుండటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ అడుగులు వేస్తోంది. నూతన విధానం ప్రకారం ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలను ప్రభుత్వం ప్రత్యేకంగా అభినందించనుంది. ఇందులో భాగంగా ప్రతి జిల్లాలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు కలిగిన మూడు ఉత్తమ జంటలను ఎంపిక చేసి, వారికి రూ.5,000 చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేయనున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో ఈ ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగనుంది. కేవలం సంతానాన్ని పెంచడమే కాకుండా, తల్లి మరియు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగా ఒక కాన్పుకు, మరో కాన్పుకు మధ్య కనీసం రెండేళ్ల కాలం పాటు విరామం పాటించిన దంపతులకు సైతం రూ.5,000 నగదు ప్రోత్సాహకాన్ని అందించాలని నిర్ణయించారు. ఇది తల్లుల శారీరక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ నెల 11వ తేదీ నుండి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రత్యేక అవగాహన ప్రచార కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టనున్నారు. కార్యక్రమాల్లో స్థానిక ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు,ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొని అర్హులైన దంపతులను గుర్తించి, ప్రభుత్వ మార్గదర్శకాలపై అవగాహన కల్పిస్తారు. ఈ ప్రతిపాదనలు భవిష్యత్తులో ఏపీ జనాభా స్థిరీకరణకు, మానవ వనరుల అభివృద్ధికి ఎంతో తోడ్పడతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

## జిల్లా వ్యాప్తంగా వచ్చిన 73 పిటిషన్ల స్వీకరణ

### - ప్రతి ఫిర్యాదుకు త్వరితగతిన పరిష్కారానికి జిల్లా ఎస్పీ ఆదేశాలు

**తిరుపతి సిటీ, జులై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 73 పిటిషన్లను స్వీకరించి, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదుదారుల వినతులను ఓర్పుగా విన్న అధికారులు, ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారించి చట్టపరమైన చర్యలను వేగవంతంగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి బాధితుడికి సకాలంలో న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అందిన ప్రతి పిటిషన్ను వెంటనే సంబంధిత అధికారులకు పంపించి, ప్రాధాన్యత ఆధారంగా విచారణ పూర్తి చేసి నిర్ణీత గడువులో పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ప్రజల ఫిర్యాదుల ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి, చట్టపరంగా న్యాయం జరిగేలా అధికారులు కట్టుబడి పనిచేయాలి అని సూచించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ రమణ పి.జి.ఆర్.ఎస్ సీఐ సుదర్శనరావు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

## తిరుమలలో 30 మంది బైండోవర్

### -లైసెన్సులు లేకుండా వ్యాపారం చేయడం నిషేధం: ఎస్పీ

**తిరుమల, జులై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భక్తుల భద్రత, సౌకర్యం, తిరుమల క్షేత్ర పవిత్రతను పరిరక్షించే లక్ష్యంతో తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీకృష్ణ, ఆదేశాల మేరకు, తిరుమల డీఎస్పీ పర్యవేక్షణలో తిరుమల పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అధికారులు నేడు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఎటువంటి అనుమతులు లేదా లైసెన్సులు లేకుండా భక్తులకు అనధికారికంగా నామాలు పెడుతూ, అలాగే లైసెన్సులు లేకుండా వివిధ రకాల వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న 30 మందిని గుర్తించారు. వారిని తిరుమల నుంచి కిందికి పంపించి కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం, గౌరవ మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచి బైండోవర్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీకృష్ణ, సంయుక్తంగా మాట్లాడుతూ, తిరుమలలో ఎటువంటి అనుమతులు లేకుండా నామాలు పెట్టడం, లైసెన్సులు లేకుండా వ్యాపారాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు.

## ఎర్రచందనం స్మగ్లర్ పై పీడీ యాక్ట్

**తిరుపతి,జులై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎర్రచందనం అక్రమ రవాణాకు చెందిన పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న కేరళకు చెందిన నాసర్ కెవిన్ ఎలియాస్ నాసర్ భాయ్(53)పై టాస్క్ ఫోర్స్ అధికారులు పీడీ యాక్ట్ అమలు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బరాయుడు ప్రత్యేక కార్యాచరణ అమలులో భాగంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్పీ జె.కులశేఖర్ మార్గ నిర్దేశకత్వంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడమే కాకుండా, ఎక్కువ కేసుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని, మూలాగా వీర్పడి స్మగ్లింగ్కు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ లు అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా కేరళకు చెందిన నాసర్ కెవిన్ ఎలియాస్ నాసర్ భాయ్ తమిళనాడు లోని కోయంబత్తూరు జిల్లా మెట్టుపాలయంలో ఉంటూ ఎర్రచందనం స్మగ్లింగ్కు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఇతనిపై పీడీ యాక్ట్ అమలుకు టాస్క్ ఫోర్స్ సిఫారసు చేసింది. ఈ మేరకు తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు.


## అమరావతి ఛాంపియన్‌షిప్-2026 పోస్టర్ ఆవిష్కరణ

**పుట్టపర్తి, జులై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నేషనల్ స్పోర్ట్స్ డే(ఆగస్టు 29) పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'అమరావతి ఛాంపియన్‌షిప్--2026' వాల్ పోస్టర్ పత్రికను సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఈ ఛాంపియన్‌షిప్ ఒక గొప్ప వేదికని పేర్కొన్నారు. జులై 15 నుండి ఆగస్టు 29 వరకు నియోజకవర్గ, జిల్లా, మరియు రాష్ట్ర స్థాయిలలో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. అండర్-17, అండర్-23 (బాలురు, బాలికలు) విభాగాల్లో మొత్తం 12 క్రీడాంశాలలో (ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, యోగా) పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని యువత, క్రీడాకారులుసద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కిషోర్, ఆర్డీఓ సువర్ణ, డీఈఓ క్రిస్టప్ప, ఏపీ టూరిజం మేనేజర్ ప్రతాప్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.3 లక్షల సిఎస్ఆర్ విరాళం అభినందనీయం

**అనంతపురం, జులై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అనంతపురం జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్-2026 కోసం సిఎస్ఆర్ కింద సప్తగిరి క్యాంపైర్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రూ.3 లక్షల విరాళాన్ని అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్-2026 కోసం సప్తగిరి క్యాంపైర్ ప్రైవేట్ లిమిటెడ్ వారు మూడు లక్షల రూపాయల విరాళానికి సంబంధించిన చెక్ ను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌కు సప్తగిరి కర్పూరం ప్రైవేట్ లిమిటెడ్ తరపున సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యు.మహమ్మద్ హనీఫ్, డిఎస్డీఓ మంజుల అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్-2026 కోసం సప్తగిరి క్యాంపైర్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రూ.3 లక్షల విరాళం అందించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా డిఎస్డీఓ మంజుల మాట్లాడుతూ జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ కోసం జిందాల్ ఫ్యాక్టరీ వారు 2 లక్షలు, గుత్తి రెన్యూ ఎనర్జీ వారు 2.లక్షలు, అయ్యప్ప క్రాకర్స్ వారు 40 వేలు సిఎస్ఆర్ నుంచి విరాళాలను అందించడం జరిగిందని తెలిపారు.

## ఆదిత్యలో ప్రారంభమైన పారిశ్రామిక నైపుణ్యాభివృద్ధి శిక్షణ



**మదనపల్లె, జులై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం సెమినార్ హాల్-114లో 20 రోజుల(ఎంఎస్ఎంఈ రాంప్) పారిశ్రామిక నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఏఐ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ (ఏఐ అండ్ డీఎస్) విభాగాల నుండి ఎంపిక చేయబడిన చివరి సంవత్సరం బి.టెక్ విద్యార్థుల సాంకేతిక సామర్థ్యాలను, పరిశ్రమ సంసిద్ధతను పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని లార్ ఐటీ క్లౌడ్ సొల్యూషన్స్ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాయుడు పెయ్యాల, పారిశ్రామిక ప్రోత్సాహక అధికారి శ్రీ నాగార్జున కొప్పాల, లారెఐటి క్లౌడ్ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు అండ్ సీఈఓ శ్రీ శివనాగ తేజ, విశిష్ట వనరుల వ్యక్తులు సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ బాబు కొత్తచెరువు షేక్, ఏఐ వ్యూహం అండ్ సాంకేతికత డైరెక్టర్ షేక్ సమీర్ హాజరయ్యారు. సభకు స్వాగతం పలుకుతూ ఏఐ అండ్ డీఎస్ విభాగం ప్రొఫెసర్ అండ్ హెడ్ డాక్టర్ ఆర్.మహమ్మద్ షఫీ, ఎంఎస్ఎంఈ ర్యాంప్ పారిశ్రామిక నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం లక్ష్యాలను, ప్రాముఖ్యతను పరిచయం చేశారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో విద్యార్థులకు ప్రత్యక్ష శిక్షణ, ఆచరణాత్మక అనుభవం, ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసాన్ని అందించడం ద్వారా విద్యాభ్యాసానికి, పరిశ్రమ అంచనాలకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చడానికి కార్యక్రమం రూపొందించబడిందని ఆయన నొక్కి చెప్పారు.

## ఆరు రోజుల పాటు ప్రధాని విదేశీ పర్యటన

### -ఇండోనేషియాకు చేరుకున్న ప్రధాని మోదీ
### -గగనతలంలో యుద్ధవిమానాల ఎస్కార్ట్
### -ఘనంగా స్వాగతం పలికిన ఇండోనేసియా అధ్యక్షుడు



**న్యూఢిల్లీ,జులై6(ఆర్ఎన్ఎ):** ప్రధాని నరేంద్రమోదీ ఇండోనేసియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. మోదీని ఆ దేశం ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం జకార్తా గగతనలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి. ప్రధాని మోదీ విమానాశ్రయానికి చేరుకోగానే ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. తాను జకార్తా చేరుకున్నానని.. ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికిన తీరు తనను ఎంతగానో కదిలించిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత పెంచే లక్ష్యంతో ముందుకు వెళ్తామన్నారు. ఇండోనేసియాలో పర్యటన ముగిసిన అనంతరం ప్రధాని మోదీ జులై 8న ఆస్ట్రేలియా చేరుకుంటారు. జులై 9న అక్కడ జరిగే 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి న్యూజిలాండ్‌కు వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల పర్యటనకు బయలుదేరారు. జులై 6 నుంచి 11 వరకు కొనసాగనున్న ఈ ఆరు రోజుల పర్యటనలో ఆయా దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపను న్నారు మోదీ. ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించడంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఇండో-పసిఫిక్ ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై కీలకంగా చర్చించనున్నారు. అలాగే భారతీయ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు ప్రముఖ వ్యాపారవేత్తలతోనూ సమావేశం కానున్నారు. పర్యటనకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఓ కీలక ప్రకటన విడుదల చేశారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనలు భారత యాక్ట్ ఈస్ట్ పాలసీ, మహాసాగర్ విజన్‌కు మరింత బలం చేకూరుస్తాయని ఆయన తెలిపారు. స్వేచ్ఛాయుత, బహిరంగ, సమ్మిళిత ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణంపై భారత్ నిబద్ధతను ఈ పర్యటన మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ జులై 6 నుంచి 8 వరకు ఇండోనేషియాలో పర్యటించనున్నారు. ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది. ప్రధానిగా నరేంద్ర మోదీ నాలుగోసారి ఇండోనేషియాలో పర్యటిస్తున్నారు. జకార్తాలో అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతోతో ప్రధాని మోదీ సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించనున్నారు. అనంతరం భారతీయ ప్రవాసులను ఉద్దేశించి భారీ సభలో ప్రసంగించనున్నారు. అలాగే యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో ఉన్న యోగ్యకర్తలోని ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఇండోనేషియా పర్యటన అనంతరం జులై 8 నుంచి 10 వరకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. అలాగే ఆ దేశ గవర్నర్ జనరల్ సామ్ మోస్టిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకోనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే ఇండియా-ఆస్ట్రేలియా సీఈఓల ఫోరంలో పాల్గొని ఇరు దేశాల ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. భారతీయ ప్రవాసులతోనూ ప్రత్యేకంగా సమావేశమవుతారు. ఆస్ట్రేలియాపర్యటన అనంతరం జులై 10, 11 తేదీల్లో న్యూజిలాండ్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆ దేశ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరగనుంది. మరోవైపు దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్‌ను సందర్శిస్తున్న తొలి భారత ప్రధానమంత్రిగా మోదీ నిలవనున్నారు. ఆక్లాండ్‌లో ప్రధాని లక్సన్‌తో సమావేశమై వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ద్వైపాక్షిక సహకారం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. గత రెండేళ్లలో ఇరు దేశాల మధ్య ముఖ్యంగా వాణిజ్యం, రక్షణ రంగాల్లో నమోదైన పురోగతిని సమీక్షించ నున్నారు. అదే సమయంలో ప్రముఖ వ్యాపార, క్రీడా రంగాల ప్రముఖులతోనూ ప్రధాని నరేంద్ర మోదీ సమావేశం కానున్నారు. ఆ తర్వాత భారతీయ ప్రవాసులను ఉద్దేశించి భారీ సభలో ప్రసంగించనున్నారు.

## పశ్చిమాసియలో దారికొస్తున్న పరిస్థితి

### -చమురు ఉత్పత్తి పెంచాలని ఒపెక్ ప్లస్ దేశాల నిర్ణయం

**న్యూఢిల్లీ,జులై6(ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియాలో ఉద్రిక్తత తగ్గిన నేపథ్యంలో ముడి చమురు ఉత్పత్తి పెంచాలని ఒపెక్ ప్లస్ కూటమికి చెందిన 7 దేశాలు నిర్ణయం తీసుకున్నాయి. ఒపెక్ ప్లస్‌కు చెందిన సౌదీ అరేబియా, రష్యా, ఇరాక్, కువైట్, కజకస్థాన్, అల్జీరియా, ఒమన్ దేశాలు ఆగస్టు నుంచి రోజుకు 1,88,000 బారెళ్ల అదనపు ఆయిల్ ఉత్పత్తి చేయడానికి అంగీకరించాయి. ఒపెక్ కూటమి నెలవారీ ఆయిల్ ఉత్పత్తిని పెంచడం ఇది వరుసగా ఐదవసారి. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలను స్థిరంగా ఉంచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయిల్ ఉత్పత్తిని పెంచడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్లో చమురు కొరత లేకుండా చూస్తూనే.. ధరలు మరీ పడిపోకుండా సమతుల్యతను కాపాడాలని ఒపెక్ భావిస్తోంది. గ్లోబల్ మార్కెట్లో చమురు ధరల్లో వచ్చే మార్పులు ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు, ద్రవ్యోల్బణంపై నేరుగా ప్రభావం చూపుతాయి. గత మార్చి నెలలో బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 120 డాలర్ల వరకు చేరింది. ఇప్పుడు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడంతో ధరలు మళ్లీ పాత స్థితికి చేరుకున్నాయి. ప్రస్తుతం బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 72 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఒపెక్ ప్లస్ దేశాల అదనపు ఆయిల్ ఉత్పత్తి వల్ల భారత్ లాంటి చమురు దిగుమతులపై అధికంగా ఆధారపడే దేశాలకు కొంత ఉపశమనం లభించనుంది. దేశంలో చమురు ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది.

## బహ్రెయిన్‌లో నిజామాబాద్ వాసి మృతి

### -బీచ్‌లో ప్రమాదవశాత్తు దుర్మరణం

**నిజామాబాద్,జులై6(ఆర్ఎన్ఎ):** బహ్రెయిన్‌లో విషాదం నెలకొంది. దుర్రత్ అల్ బహ్రెయిన్ సముద్ర తీరంలో నీటిలో మునిగి తెలంగాణ వాసి ప్రాణాలు కోల్పోయారు. మృతుడిని నిజామాబాద్ జిల్లాకు చెందిన తోట శ్రీనివాస్‌గా గుర్తించారు. అతను బహ్రెయిన్‌లోని ఏఎంసీ సంస్థలో ప్రాజెక్ట్ డిపార్ట్‌మెంట్‌లో ఆపరేటర్‌గా 2019 నవంబర్ 26వ తేదీ నుంచి విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో తాజాగా సముద్ర తీరానికి వెళ్లిన అతను ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయాడు. దీనిపై సమాచారం అందుకున్న బ్రహెయిన్ కోస్ట్‌గార్డు బృందాలు ఘటనాస్థలికి చేరుకు సహాయక చర్యలు చేపట్టాయి. కానీ లాభం లేకుండాపోయింది. తోట శ్రీనివాస్ మృతిపై ఏంఎసీ సంస్థ యాజమాన్యం సంతాపం ప్రకటించింది. అతని కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది.

## దేశసేవే జీవిత లక్ష్యంగా ఎంచుకున్న ముఖర్జీ

### -ఘనంగా నివాళి అర్పించిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ,జులై6(ఆర్ఎన్ఎ):** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన త్యాగం, ప్రజాసేవ పట్ల చూపిన అంకితభావం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన జీవితం 'ధైర్యానికి, మాతృభూమి పట్ల అచంచలమైన నిబద్ధతకు కాలాతీత ఉదాహరణ' అని కొనియాడారు. ప్రధాని మోదీ తన బ్లాగ్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవిత విశేషాలను ప్రస్తావించారు. శ్యామా ప్రసాద్ సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ, దేశసేవనే జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారని చెప్పారు. వలస పాలన, విభజన రాజకీయాలు, సామాజిక సవాళ్ల వంటి అంశాలపై ఆయన రాజీపడకుండా పోరాడారని గుర్తు చేశారు. దేశ సమైక్యతే శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రజాజీవితానికి మూల సూత్రమని ప్రధాని అన్నారు. దేశ విభజన సమయంలో పశ్చిమ బెంగాల్ భారతదేశంలోనే కొనసాగడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, అనంతరం జమ్మూ కశ్మీర్ సంపూర్ణ విలీనానికి కృషి చేస్తూ నిర్బంధంలోనే ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. మ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35ఏలను 2019లో తమ ప్రభుత్వం రద్దు చేసిందని, అది శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు నిజమైన నివాళి అని ప్రధాని మోదీ అభివర్ణించారు. అలాగే కలకత్తా విశ్వ విద్యాలయానికి అత్యంత పిన్న వయసులో వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్యామా ప్రసాద్.. పరిశోధన, గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. స్వతంత్ర భారత తొలి పరిశ్రమల మంత్రి అయిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్, సింద్రి ఎరువుల కర్మాగారం వంటి కీలక ప్రాజెక్టులకు పునాది వేశారని ప్రధాని గుర్తు చేశారు.




## శ్రీలంకపై అన్వయ్ ద్రవిడ్ మెరుపు ఇన్నింగ్స్

### -67 బంతుల్లో 87 పరుగులతో రాణించిన అన్వయ్



**న్యూఢిల్లీ,జులై6(ఆర్ఎన్ఎ):** భారత క్రికెట్ దిగ్గజం, 'ది వాల్' రాహుల్ ద్రవిడ్ క్రికెట్ వారసత్వాన్ని ఆయన చిన్న కుమారుడు అన్వయ్ ద్రవిడ్ ఘనంగా ముందుకు తీసుకెళుతున్నాడు. శ్రీలంక అండర్-19 జట్టుతో నేడు జరిగిన రెండో యూత్ వన్డేలో ఈ యువ వికెట్ కీపర్-బ్యాటర్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. మహింద రాజపక్స అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో కేవలం 67 బంతుల్లోనే 9 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 87 పరుగులు చేసి భారత జట్టు భారీ స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 19వ ఓవర్ ముగిసేసరికి 81 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన 17 ఏళ్ల అన్వయ్ ద్రవిడ్, మరో బ్యాటర్ అర్జున్ రాజ్‌పుత్ (76 పరుగులు) తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 145 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును ఆదుకున్నారు. ముఖ్యంగా అన్వయ్ దూకుడుగా ఆడుతూ కేవలం 47 బంతుల్లోనే తన తొలి యూత్ వన్డే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతని దూకుడు చూసి శతకం ఖాయమనిపించినా, శ్రీలంక లెఫ్ట్ ఆర్మ్ పేసర్ గిమ్హాన్ మెండిస్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. 129.85 స్ట్రైక్ రేట్‌తో ఆడిన అన్వయ్ ఇన్నింగ్స్ జట్టు స్కోరును పరుగులు పెట్టించింది. అర్జున్ రాజ్‌పుత్ కూడా 81 బంతుల్లో 76 పరుగులు చేసి రాణించాడు. అయితే, దిమంత మహవితాన అద్భుతమైన త్రోకు అతను రనౌట్‌గా వెనుదిరిగాడు. కీలక భాగస్వామ్యం విడిపోయిన తర్వాత భారత ఇన్నింగ్స్ మళ్లీ తడబడింది. 263 పరుగుల వద్ద ఏడో వికెట్‌గా అన్వయ్ ఔటైన తర్వాత, భారత టెయిలెండర్లు చేతులెత్తేశారు. కేవలం 22 పరుగుల వ్యవధిలో చివరి మూడు వికెట్లు కోల్పోయి 47.2 ఓవర్లలో 285 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంక బౌలర్లలో గిమ్హాన్ మెండిస్ 41 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి భారత్‌ను కట్టడి చేశాడు. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉంది. తొలి మ్యాచ్‌లో 321 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇటీవల వినూ మన్కడ్ ట్రోఫీలో కర్ణాటక జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన అన్వయ్, ఆ టోర్నీలో 220 పరుగులు చేసి మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఈ ప్రదర్శనతో రాబోయే అండర్-19 ప్రపంచ కప్‌కు ఎంపికయ్యే అవకాశాలను మరింత మెరుగుపరుచుకున్నాడు. కాగా, అన్వయ్ అన్నయ్య సమిత్ ద్రవిడ్ కూడా ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ఎంపికైనా మోకాలి గాయం కారణంగా దూరమయ్యాడు.

## అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు నేమార్ రిటైర్మెంట్

**న్యూఢిల్లీ,జులై6(ఆర్ఎన్ఎ):** న్యూజెర్సీ వేదికగా జరిగిన ఫిఫా వరల్డ్ కప్ రౌండ్ ఆఫ్ 16 పోరులో నార్వే చేతిలో బ్రెజిల్ 2-1 తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ దారుణ ఓటమి తర్వాత బ్రెజిల్ స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు నేమార్ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. మ్యాచ్ ముగిసిన వెంటనే 34 ఏళ్ల నేమార్ భావోద్వేగానికి గురవుతూ.. తన 16 ఏళ్ల సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్లు వెల్లడించాడు. 'సెలెకావో' (బ్రెజిల్ జట్టు)తో తన ప్రయాణం ముగిసిందని స్పష్టం చేశాడు. ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌లో నార్వే ఆటగాడు ఎర్లింగ్ హాలాండ్ చివరి నిమిషాల్లో వరుసగా రెండు గోల్స్ చేసి బ్రెజిల్‌కు గట్టి షాక్ ఇచ్చాడు. స్టాపేజ్ టైమ్‌లో నేమార్ పెనాల్టీని గోల్‌గా మలిచినప్పటికీ బ్రెజిల్‌కు ఓటమి తప్పలేదు. మ్యాచ్ అనంతరం నేమార్ మాట్లాడుతూ.. "నేను ఎంతో ప్రయత్నించాను, కానీ ఇక అంతా ముగిసింది. నేను ఇక్కడే ప్రారంభించాను, ఇక్కడే ముగించాను" అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. గాయంతోనే వరల్డ్ కప్‌కు వచ్చిన నేమార్.. ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఆ తర్వాత కోచ్ కార్లో అన్సెలొట్టి వ్యూహాల్లో భాగంగా స్కాలాండ్, నార్వే మ్యాచ్‌లలో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి వచ్చాడు. బ్రెజిల్ జెర్సీలో పెనాల్టీ రూపంలో అతడు చేసిన చివరి గోల్ కేవలం ఓదార్పుగానే మిగిలిపోయింది. ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన బ్రెజిల్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. 2010లో సీనియర్ జట్టు తరఫున అరంగేట్రం చేసిన నేమార్.. బ్రెజిల్ చరిత్రలోనే అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. మొత్తం 129 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 80 గోల్స్ సాధించాడు. నాలుగు ఫిఫా వరల్డ్ కప్‌లలో బ్రెజిల్ ఫుట్‌బాల్‌కు ఫేస్ ఐకాన్‌గా నిలిచినప్పటికీ, ప్రపంచకప్ ట్రోఫీని మాత్రం అందుకోలేకపోయాడు. అయితే, 2013లో ఫిఫా కాన్ఫెడరేషన్స్ కప్, 2016 రియో ఒలింపిక్స్‌లో కెప్టెన్‌గా బ్రెజిల్‌కు బంగారు పతకం, 2012 లండన్ ఒలింపిక్స్‌లో రజతం అందించాడు. కెరీర్ అంతటా గాయాలు వేధించినా, అంచనాల భారం వెంటాడినా బ్రెజిల్ అత్యుత్తమ ఫుట్‌బాలర్లలో ఒకడిగా నేమార్ నిలిచిపోతాడు. మ్యాచ్ ముగిశాక మైదానంలో నేమార్ కన్నీళ్లు పెట్టుకోగా.. సహచర ఆటగాళ్లు అతడిని ఓదార్చారు. ఈ ఓటమితో కోచ్ కార్లో అన్సెలొట్టి ఆధ్వర్యంలోని బ్రెజిల్ వరల్డ్ కప్ ప్రస్థానం కూడా ముగిసింది.

## ఇదే నా చివరి ప్రపంచకప్

### -క్రిస్టియానో రొనాల్డో కీలక ప్రకటన

**న్యూఢిల్లీ,జులై6(ఆర్ఎన్ఎ):** పోర్చుగల్ ఫుట్‌బాల్ సూపర్‌స్టార్ క్రిస్టియానో రొనాల్డో తన అంతర్జాతీయ కెరీర్‌పై ఒక కీలక ప్రకటన చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న 2026 ఫిఫా ప్రపంచకప్ టోర్నమెంటే తన కెరీర్‌లో చివరిదని ఆయన స్పష్టం చేశాడు. స్పెయిన్‌తో జరగనున్న రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌కు ముందు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తన భవిష్యత్తు ప్రణాళికలపై వస్తున్న ఊహాగానాలకు తెరదించాడు. ఈ సందర్భంగా రొనాల్డో మాట్లాడుతూ.. "ఈ ప్రపంచకప్‌ను వీలైనంత ఎక్కువగా ఆస్వాదించాలనుకుంటున్నాను. ఎందుకంటే ఇదే నా చివరి ప్రపంచకప్. అయితే, రేపటి మ్యాచే ఈ టోర్నీలో నా చివరి గేమ్ కాకూడదని ఆశిస్తున్నాను" అన్నాడు. 41 ఏళ్ల రొనాల్డోకు ఇది ఆరో ప్రపంచకప్ కావడం విశేషం. ఈ టోర్నీలో ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు ఆడి మూడు గోల్స్ సాధించాడు. వీటిలో ఒకటి నాకౌట్ దశలో చేసినదే. తన సుదీర్ఘ కెరీర్‌లో ప్రపంచకప్‌లలో మొత్తం 11 గోల్స్ నమోదు చేశాడు. రిటైర్మెంట్‌పై పదేపదే ప్రశ్నలు అడగవద్దని మీడియాను కోరాడు. "నేను ఎప్పుడు రిటైర్ అవ్వాలనుకుంటే అప్పుడే అవుతాను. మీరు కోరుకున్నప్పుడు కాదు. ఈ ప్రశ్న అడగడం సమయం వృథా. నా దృష్టి మొత్తం రేపటి మ్యాచ్‌పైనే ఉంది" అని స్పష్టం చేశాడు. జట్టు పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, "జట్టుకు సహాయం చేయడానికి నేను ఎప్పుడూ నా శరీరం, ఆత్మతో కట్టుబడి ఉంటాను. నేను ఆడుతున్నానా? లేదా? అన్నది ముఖ్యం కాదు. నా పాత్ర ఎప్పుడూ కీలకమే" అని వివరించాడు. ఇది తన చివరి ప్రపంచకప్ అయినప్పటికీ, టోర్నీ గెలవాలనే లక్ష్యంతోనే పోర్చుగల్ జట్టు ఇక్కడికి వచ్చిందని రొనాల్డో ధీమా వ్యక్తం చేశాడు. "ప్రపంచకప్ గెలవగలమనే నమ్మకం లేకపోతే మేము ఇక్కడ ఉండేవాళ్లం కాదు. ఇది ఒక అందమైన అనుభవం. ప్రతీ గేమ్‌లోనూ మా ఆటను మెరుగుపరుచుకుంటున్నాం. ఇప్పటికే కొన్ని పెద్ద జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించాయి. మా జట్టు చాలా ప్రశాంతంగా ఉంది, మేము బాగా శిక్షణ పొంది, మ్యాచ్‌కు సిద్ధమయ్యాం" అని అన్నాడు. మొత్తంగా ఈ ప్రపంచకప్‌తో తన ప్రస్థానానికి ముగింపు పలకనున్నప్పటికీ, జట్టును విజేతగా నిలపాలనే గట్టి పట్టుదలతో రొనాల్డో ఉన్నట్లు స్పష్టమవుతోంది.

# అంతులేని నమ్మకంతో 'లెనిన్' బృందం



ఇంకో అయిదు రోజుల్లో లెనిన్ విడుదల కానుంది. జూలై 10 కోసం అక్కినేని అభిమానులే కాదు సగటు మూవీ లవర్స్ కూడా మంచి కమర్షియల్ సినిమా చూడబోతున్నామనే ఆశతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటిదాకా జరిగిన ప్రమోషన్లు సంతృప్తికరంగానే ఉన్నాయి. ప్రీ రిలీజ్ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. నాగార్జున ముఖ్యఅతిథిగా జరిగిన ఈ వేడుకలో కాస్ట్ అండ్ క్రూ మొత్తం పాల్గొంది. ఎవరి స్పీచులు విన్నా ప్రతి ఒక్కరిలో అంతులేని నమ్మకం వ్యక్తమయ్యింది. నిర్మాతల్లో ఒకరైన నాగవంశీ మాట్లాడుతూ ఇంటర్వెల్, ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ మీరు ఊహించని స్థాయిలో ఉంటాయని, ఆ ట్విస్టులు ఆశ్చర్యం కలిగిస్తాయని బల్లగుద్ది మరీ చెప్పడం అభిమానులకు కొత్త జోష్ ఇచ్చింది. నాగార్జున సైతం ఇదే కాన్ఫిడెన్స్ చూపించారు. చింటూ అంటూ వంశీ సోషల్ మీడియా పేరుని ప్రస్తావించి మరీ విశేషాలు పంచుకున్నారు. ఇక అఖిల్, భాగ్యశ్రీ బోర్సే సంగతి సరేసరి. హిట్టు కొట్టడంలో ఒక్క శాతం డౌట్ వద్దనే స్థాయిలో ఆత్మవిశ్వాసాన్ని చూపించారు. శివాజీ, బ్రహ్మాజీ మొదలైన ఇతర ఆర్టిస్టులు కూడా ఇదే వరస. కొంత కాలంగా కాస్త డల్లుగా ఉన్న అక్కినేని ఫ్యాన్స్ కి లెనిన్ జోష్ ఇవ్వాలి. ఎందుకంటే నాగార్జున గత రెండు సినిమాలు కూలి, కుబేరలో ఆయన హీరో కాదు. సోలో హీరోగా నా సామి రంగా తర్వాత దర్శనమే లేదు. తండేల్ వచ్చి ఏడాది దాటేసినా నాగచైతన్య నుంచి ఇంకో సినిమా రాలేదు. అఖిల్ గురించి తెలిసిందే. ఏజెంట్ తర్వాత చాలా కాలం మాయమైపోయాడు. ఈ లోటులన్నీ తీర్చాల్సింది లెనినే. కాంపిటీషన్ లేదు. మొన్నొచ్చిన కొత్త రిలీజులు రెండో వారంలో నెమ్మదించిపోతాయి. సో టెన్షన్ లేదు. బాలీవుడ్ కూడా అంతంత మాత్రంగా నెట్టుకొస్తోంది. సో లెనిన్ కనక సౌండ్ చేయగలిగితే మంచి వసూళు చూసుకోవచ్చు. వినరో భాగ్యము విష్ణుకథ ఫేమ్ మురళికిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించిన లెనిన్ కు తమన్ సంగీతం ఆకర్షణ కానుంది. మహా భారతాన్ని స్ఫూర్తిగా తీసుకున్న లెనిన్ లో కమర్షియల్ ఎలిమెంట్స్ పుష్కలంగా ఉంటాయట. అవి కూడా ఊహించని మలుపులతో.




## తమిళంలోకి శివాజీ క్రేజీ ఎంట్రీ



తెలుగులో ఒకప్పుడు చిన్న సినిమాల కథానాయకుడిగా చాలా ఏళ్ల పాటు కెరీర్‌ను నడిపించాడు శివాజీ. కానీ తర్వాత అతడి మనసు రాజకీయాల వైపు మళ్లింది. ఆ టైంలో సినిమాలకు కూడా దూరం అయిపోయాడు. కానీ చివరికి రాజకీయాలూ వదిలేసి, సినిమాలూ మానేసి పూర్తిగా ఫేడవుట్ అయిపోయాడు. ఇక మళ్లీ అతణ్ని తెర మీద చూడడం సందేహమే అనుకుంటే.. అనుకోకుండా బిగ్ బాస్ షోలోకి రావడం, మళ్లీ జనాల దృష్టిలో పడి సినిమా అవకాశాలు అందుకోవడం.. రీఎంట్రీలో ఫస్ట్ ఛాన్స్ 'కోర్ట్'ను రెండు చేతులా అందిపుచ్చుకోవడంతో శివాజీ పేరు ఇండస్ట్రీలో మార్మోగింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కూడా రానంత క్రేజ్‌ను 'కోర్ట్' మూవీతో సంపాదించాడు శివాజీ. ఆపై 'దండోరా' చిత్రంతోనూ శివాజీ తన ప్రత్యేకతను చాటుకున్నాడు. హీరోగా నటించిన 'సంప్రదాయిని సుప్పిని శుద్ధ పూసని' ఆశించిన ఫలితాన్నివ్వకపోయినా శివాజీ కెరీర్‌కేమీ ఢోకా లేదు. ఈ వారం రిలీజ్ కానున్న క్రేజీ మూవీ 'లెనిన్'లోనూ ఆయన కీలక పాత్ర పోషించాడు. ఇంతలో శివాజీకి ఒక మంచి ప్రాజెక్టులో అవకాశం దక్కింది. లవ్ టుడే, డ్రాగన్, డ్యూడ్ చిత్రాలతో తమిళంతో పాటు తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ సంపాదించిన నటుడు, దర్శకుడు ప్రదీప్ రంగనాథన్ నిర్మాతగా మారి తీస్తున్న కొత్త సినిమాలో శివాజీ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ రోజే ఈ మూవీ అనౌన్స్‌మెంట్ వీడియో వచ్చింది. దాన్ని వేరే లెవెల్లో తీర్చిదిద్దింది టీం. ఆరుగురు కుర్రాళ్లు కలిసి 'పీఆర్ ఆల్ఫా యూనిట్' పేరుతో రూపొందిస్తున్న ఈ చిత్రంలో మామిత బైజు లీడ్ రోల్ చేస్తోంది. 'డ్రాగన్' దర్శకుడు అశ్వత్ మారిముత్తు కూడా ఇందులో ఒక ముఖ్య పాత్ర పోషిస్తుండగా.. మరో ముఖ్య పాత్రధారిగా శివాజీని పరిచయం చేశారు. అనౌన్స్‌మెంట్ వీడియోలో శివాజీని భాగం చేశారంటే ఆయనకు ఇస్తున్న ప్రాధాన్యమేంటో అర్థమవుతుంది. 'కోర్ట్', 'దండోరా' చిత్రాలతో ఇతర భాషల్లోనూ శివాజీకి మంచి గుర్తింపు వచ్చింది. ఆయనలో మంచి పెర్ఫామర్ ఉన్న సంగతి గుర్తించే ప్రదీప్ స్వయంగా ఈ పాత్రకు ఎంపిక చేసినట్లు కనిపిస్తోంది. ఎందుకంటే ఈ చిత్రానికి కథ అందించింది కూడా అతనే. ఈ సినిమాలో శివాజీ తనదైన ముద్ర వేయగలిగాడంటే తమిళంలోనూ ఆయన బిజీ అయిపోతాడేమో. కెరీర్లో ఈ దశలో ఇలాంటి రైజ్ ఆశ్చర్యం కలిగించేదే.

# ఫ్యామిలీ సినిమా... దున్నేస్తోంది



తమిళంలో చాలా ఏళ్ల నుంచి మంచి మంచి సినిమాలు చేస్తున్నప్పటికీ.. తెలుగమ్మాయి గుత్తా జ్వాలను పెళ్లి చేసుకోవడం ద్వారానే ఎక్కువగా తెలుగు వాళ్ల దృష్టిని ఆకర్షించాడు విష్ణు విశాల్. ఆ గుర్తింపుకి తోడు.. రవితేజ నిర్మాణ భాగస్వామిగా ఉండడం వల్ల కొన్నేళ్ల ముందు అతను నటించిన ఫ్యామిలీ సినిమా 'గట్టా కుస్తీ'ని తెలుగులో 'మట్టి కుస్తీ' పేరుతో విడుదల చేస్తే కొంచెం క్రేజ్ వచ్చింది. ఐతే ఆ సినిమా ఓ మోస్తరు ఫలితంతో సరిపెట్టుకుంది. ఇలాంటి యావరేజ్ మూవీకి సీక్వెల్ చేయడం అరుదు. కానీ విష్ణు విశాల్ అండ్ టీం 'గట్టా కుస్తీ-2' తీసి ఆశ్చర్యపరిచింది. గత శుక్రవారం పెద్దగా అంచనాలు లేకుండా రిలీజైంది ఈ సినిమా. దీనికి గొప్ప రివ్యూలేమీ రాలేదు. 'గట్టా కుస్తీ-1'తో పోలిస్తే కామెడీ వరకు బెటర్ అన్నారే తప్ప.. యావరేజ్ మూవీ అనే తీర్మానించారు క్రిటిక్స్. కొన్ని ఇంగ్లిష్ వెబ్ సైట్స్ 2 అంతకంటే లోపే రేటింగ్స్ ఇచ్చాయి. కానీ ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఊహించని విధంగా బ్లాక్ బస్టర్ చేసేస్తున్నారు. ఈ మధ్య ఫ్యామిలీ సినిమాలకు పట్టం కడుతున్న తమిళ ప్రేక్షకులు.. దీన్ని కూడా బాగా ఆదరిస్తున్నారు. తొలి రోజు వసూళ్లతో పోలిస్తే రెండో రోజు కలెక్షన్లు 75 శాతం పెరిగాయంటే.. 'గట్టా కుస్తీ-2' ఎలా జనాల్లోకి చొచ్చుకెళ్లిందో అర్థం చేసుకోవచ్చు. ఆదివారం ఈ చిత్రం తమిళనాడులోని మేజర్ సిటీస్‌లో ప్యాక్డ్ హౌస్‌లతో రన్ అయింది. వీకెండ్లో 'గట్టా కుస్తీ-2'కు రూ.16 కోట్ల దాకా కలెక్షన్లు వచ్చాయి. విష్ణు విశాల్ స్థాయికి ఇది చాలా పెద్ద నంబరే. సెకండాఫ్‌లో ఉన్న ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్.. విష్ణు విశాల్, ఐశ్వర్య లక్ష్మి మధ్య వచ్చే కుస్తీ ఫైట్ ఈ సినిమాకు మేజర్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. కుటుంబ ప్రేక్షకులు కనెక్ట్ అయితే ఫలితం ఎలా ఉంటుందో నెలన్నర కిందట 'బ్లాస్ట్' మూవీ రుజువు చేయగా.. 'గట్టా కుస్తీ-2' ఇందుకు లేటెస్ట్ ఎగ్జాంపుల్‌గా నిలుస్తోంది. 'మట్టి కుస్తీ'ని తెలుగు వాళ్లు పెద్దగా పట్టించుకోలేదనో ఏమో.. సీక్వెల్‌ను తెలుగులోకి అనువదించలేదు. కానీ తమిళంలో వస్తున్న రెస్పాన్స్ చూశాక రెండు వారాలు లేటుగా అయినా తెలుగులో రిలీజ్ చేసే అవకాశాలు లేకపోలేదు. లేదంటే ఓటీటీలో రిలీజైనపుడు తెలుగు వెర్షన్ అందుబాటులోకి తెస్తారేమో.

## రెజీనా గ్లామర్ మెరుపులు



టాలీవుడ్ తో పాటు ఇతర భాషల్లోనూ వరుస ఆఫర్లతో బిజీగా ఉన్న బ్యూటీ రెజీనా కసాండ్రా లేటెస్ట్ గా నెట్టింట పంచుకున్న ఫోటోలు కుర్రకారును ఆకట్టుకుంటున్నాయి. ఎప్పుడూ తనదైన శైలిలో డిఫరెంట్ రోల్స్ ఎంచుకుంటూ నటిగా మంచి మార్కులు వేయించుకునే ఈ భామ అప్పుడప్పుడు ఇలా గ్లామర్ షోతో కూడా అదరగొడుతుంటుంది. లేటెస్ట్ గా ఓ స్పెషల్ ఫోటోషూట్ కోసం ఆమె ఇచ్చిన స్టన్నింగ్ పోజులు ఇంటర్నెట్ లో వైరల్ గా మారాయి. ఈ లేటెస్ట్ ఫోటోషూట్ లో రెజీనా లాంగ్ స్కై బ్లూ కలర్ గౌన్ లో ఎంతో అందంగా మెరిసిపోయింది. ఈ మోడ్రన్ డ్రెస్ లో ఆమె గ్లామర్ యాంగిల్ మరింత హైలైట్ అయింది. డ్రెస్ కు తగ్గట్టుగానే హెయిర్ స్టైల్ ను లూజ్ గా వదిలేసి లైట్ మేకప్ తో చాలా సింపుల్ గా కనిపించింది. ఎలాంటి భారీ ఆభరణాలు లేకుండా కేవలం తన ఎక్స్ ప్రెషన్స్ ఎట్రాక్టివ్ పోజులతో నెటిజన్ల ఫోకస్ ను తనవైపు లాగేసుకుంది.



# బిజినెస్ న్యూస్




## త్వరలో మొబైల్ రీఛార్జ్‌లు భారం.. 12-15% టారిఫ్‌లు పెరిగే ఛాన్స్




ఫోన్ రీఛార్జ్ ప్లాన్ ధరలను మరోసారి పెంచేందుకు టెలికాం కంపెనీలు సిద్ధమవుతున్నాయి. మొబైల్ టారిఫ్‌లు 12-15 శాతం పెంచే అవకాశం ఉందని సెంట్రమ్ ఇన్‌స్టిట్యూషనల్ రీసెర్చ్ వెల్లడించింది. టెలికాం మార్కెట్‌లో పోటీ తగ్గడంతో పెంపునకు అనుకూల పరిస్థితులు నెలకొన్నాయని అభిప్రాయపడింది. రానున్న 3-4 నెలల్లో ఈ పెంపు ఉండొచ్చని అంచనా వేసింది. 5జీ నెట్‌వర్క్ విస్తరణ కోసం చేసిన ఖర్చును తిరిగి రాబట్టడానికి టెలికాం కంపెనీలు త్వరలో ఛార్జీలు పెంచొచ్చని ఇప్పటికే అంచనాలున్నాయి. ఈ క్రమంలో సెంట్రమ్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. దేశీయ టెలికాం మార్కెట్‌లో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ కంపెనీలు తమ హవాను కొనసాగిస్తున్నాయి. ప్రతి నెలా కొత్త సబ్‌స్క్రైబర్లను ఆకర్షించడంలో ముందు వరుసలో ఉంటున్నాయి. మరో ప్రైవేటు టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా కూడా కొత్త యూజర్లను చేర్చుకుంటున్నప్పటికీ.. జియో, ఎయిర్‌టెల్‌తో పోల్చినప్పుడు ఈ అంతరం ఎక్కువగా ఉంటోంది. త్రైమాసిక ప్రాతిపదికన చూసినప్పుడు జియోకు కొత్తగా సగటున 70 లక్షల మంది చందాదారులు చేరొచ్చని, భారతీ ఎయిర్‌టెల్‌ను 50 లక్షల మంది ఎంచుకోవచ్చని పేర్కొంది. వొడాఫోన్ ఐడియాలో 2 లక్షల సబ్‌స్క్రైబర్లు చేరొచ్చని నివేదిక తెలిపింది. దేశంలోని 90 శాతానికి పైగా జిల్లాల్లో జియో, ఎయిర్‌టెల్ 5జీ నెట్‌వర్క్‌ను అందిస్తున్నాయి. వొడాఫోన్ ఐడియా కూడా దాదాపు 100 నగరాల్లో తన 5జీ సేవలను విస్తరించింది. వినియోగదారులు 2జీ నుంచి 4+, 5+ నెట్‌వర్క్‌లకు మారుతుండడం, పోస్టుపెయిడ్ యూజర్లు పెరుగుతుండడంతో టెలికాం కంపెనీల సగటు ఆదాయం కూడా మెరుగు కానుందని నివేదిక పేర్కొంది. జూన్ త్రైమాసికంలో 1-1.5% పెరుగుతుందని అంచనా వేసింది. 4జీ, 5జీ వినియోగం పెరుగుతుండటంతో డేటా వినియోగం కూడా గణనీయంగా పెరగనుందని తెలిపింది.

## ఫ్రీ ట్రయల్ ఫ్రీ కాదు గురూ.. మరి మ్యాండేట్ డిలీట్ చేయడం ఎలా?



యాప్‌లో కొత్త ఫీచర్ వచ్చింది.. నెల రోజులు ఫ్రీ ట్రయల్.. ఇప్పుడే సబ్‌స్క్రైబ్ చేసుకోండి. మా ఓటీటీలో కొత్తగా యాడ్‌ఫ్రీ సేవలు తీసుకొచ్చాం.. ఓ రెండు నెలలు ఉచితంగా వాడాక పేమెంట్ చేయండి.. అంటూ రకరకాల సేవలు మనల్ని ఊరిస్తుంటాయి. చాలా కంపెనీలు తమ ప్రీమియం సేవలవైపు యూజర్లను ఆకర్షించేందుకు వేసే ఎత్తుగడే ఈ ఫ్రీ ట్రయల్. ఎలాగూ ఉచితమేగానని చాలామంది సబ్‌స్క్రైబ్ అవుతుంటారు. ప్రీమియం సేవల కోసమే తీసుకునే వారికి.. ఈ ఫ్రీ ట్రయల్ ఓ విధంగా కలిసొచ్చినట్లే. కానీ, ఉచితకాలం ముగిశాక ఆపేద్దామనుకున్న వారు మాత్రం ఇరుక్కుపోతుంటారు. సబ్‌స్క్రైబ్ చేసుకున్నాక చాలా మంది దాని సంగతి మరిచిపోతుంటారు. తీరా బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యాక నాలుక కరుచుకుంటారు. మరికొందరు మాత్రం ఫ్రీ ట్రయల్ రద్దు చేయడం తెలీక తాము వాడని సేవలకూ నెల నెలా డబ్బులు చెల్లిస్తుంటారు. దీనివల్ల నగదు కోల్పోవడమే కాదు.. అకౌంట్‌లో డబ్బులు లేకపోతే ఆటోపే మ్యాండేట్ ఫెయిల్ అయి బ్యాంకులు అపరాధ రుసుం విధించొచ్చు. దీనివల్ల క్రెడిట్ స్కోరుపైనా ప్రభావం పడుతుంది.

ఆటోపే మ్యాండేట్ తెలుసుకోవడం ఎలా?

చాలా మంది దగ్గర తమ స్మార్ట్‌ఫోన్లలో ఒకటికి మించి యూపీఐ యాప్స్ ఉంటాయి. ఏదైనా ఫ్రీ ట్రయల్‌కు సబ్‌స్క్రైబ్ అయినప్పుడు ఏదో ఒక యాప్ నుంచి ఆటో డెబిట్‌కు అంగీకారం తెలుపుతూ అనుమతి ఇచ్చేస్తుంటారు. రెండు మూడుకు మించి ఇలాంటి అనుమతులు ఇచ్చినప్పుడు ఏ యాప్‌లో ఏది ఉందో తెలుసుకోవడమూ కష్టమే. అలాంటి వారి కోసమే ఒక మొబైల్ నంబర్‌పై ఎన్ని మ్యాండేట్‌లు ఉన్నాయో తెలుసుకోవడానికి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఓ సదుపాయం కల్పిస్తోంది. అ వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ మొబైల్ నంబర్‌పై ఎన్ని ఆటోపేకి అనుమతులు ఉన్నాయో తెలుసుకోవచ్చు. మీ మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వగానే అన్నీ ఒకే చోట దర్శనమిస్తాయి. కావాలంటే అక్కడే పాజ్ చేయొచ్చు. లేదంటే పూర్తిగా క్యాన్సిల్ చేయొచ్చు. యాప్‌లోనూ రద్దు చేసుకునే సదుపాయం ఉంది.

ఒక్కో యాప్‌లో ఒక్కోలా

ఒకవేళ మీరు ఫోన్‌పే వాడుతుంటే.. ప్రొఫైల్ పిక్చర్ మీద క్లిక్ చేసి పేమెంట్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఆటోపే ఆప్షన్ ఎంచుకుని కావాల్సిన మ్యాండేట్‌ను తొలగించొచ్చు పేటీఎంలో అయితే ప్రొఫైల్ మెనూలోకి వెళ్లి యూపీఐ /పేమెంట్ సెట్టింగ్స్‌లో యూపీఐ ఆటోమేటిక్ పేమెంట్స్ ఆప్షన్ ఎంచుకోవాల్సి ఉంటుంది. గూగుల్ పేలో ప్రొఫైల్ ఐకాన్ క్లిక్ చేసి అందులో నేరుగా ఈ ఆప్షన్ ఎంచుకోవచ్చు. .

## నాలుగో రోజు లాభాల్లోనే.. సెన్సెక్స్ 521 పాయింట్లు పైకి



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, క్యూ1 ఫలితాలపై ఆశావహ దృక్పథం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. ముఖ్యంగా ఆటో, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ఈ క్రమంలో వరుసగా నాలుగో రోజూ సూచీలు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 521 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 24,400 పాయింట్ల పైకి ఎగబాకింది. నిఫ్టీ 159.50 పాయింట్ల లాభంతో 24,430.35 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ, మహీంద్రా అండ్ మహీంద్రా, బీఈఎల్, రిలయన్స్, ఐసీఐసీఐ, మారుతీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. కోటక్, టీసీఎస్, బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు నష్టాలను చవిచూశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 95.38గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.50 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,148.34 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## లులు మాల్‌లో 4 రోజుల పాటు ఫ్లాట్ 50% డిస్కౌంట్ సేల్




కూకట్‌పల్లి లులు మాల్‌లో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు 'లులు ఆన్ సేల్' నిర్వహించనున్నారు. వినియోగదారులకు ఫ్ల?ట్ 50 శాతం డిస్కౌంట్ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సేల్‌కు సంబంధించి సోమవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. టాలీవుడ్ నటుడు శ్రీనందు సందడి చేశారు. ఆయన చేతులమీదుగా సేల్ అధికారిక లోగోను, ప్రత్యేక టీ-షర్ట్‌ను ఆవిష్కరించారు. లోగో ఆవిష్కరణ అనంతరం శ్రీనందు తనదైన శైలిలో కస్టమర్లతో మాట్లాడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం నిర్వాహకులు విలేకరులతో మాట్లాడారు. 200లకు పైగా బ్రాండ్లు ఈ మెగా సేల్‌లో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఫుడ్ కోర్టులో సైతం స్పెషల్ ఆఫర్లు పొందొచ్చని, మాల్‌లోని ఇతర రిటైల్ స్టోర్లు సైతం ఇందులో పాల్గొంటున్నాయని తెలిపారు. లులు గ్రాండ్ షాపింగ్ కార్నివాల్ కాంటెస్ట్‌లో 'లులు హ్యాపీనెస్ రిజిస్టర్డ్ కస్టమర్లు కనీసం రూ.2999 షాపింగ్ చేసిన వాళ్లు లక్కీ డ్రా ద్వారా హ్యుందాయ్ ఐ20 కారు గెలుచుకునే అవకాశం ఉందన్నారు. లులు హైపర్ మార్కెట్‌లో గ్రాసరీస్, ఫ్యాషన్, ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు తదితర 25 వేలకు పైగా వస్తువులపై ఫ్లాట్ 50 శాతం తగ్గింపు అందిస్తున్నట్లు తెలిపారు. అటు గేమ్స్ జోన్ ఫంటురాలో ప్రత్యేకంగా 100 శాతం బోనస్ సెలబ్రేషన్ ఆఫర్‌ను అందిస్తున్నారు. రూ.2000 లేదా అంతకంటే ఎక్కువ రీఛార్జ్ చేసుకుంటే, ఆ అమౌంట్ రెట్టింపు అవుతుందన్నారు. దీంతోపాటు కస్టమర్లకు ఉచితంగా రైడ్ కూపన్స్ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. లులు హ్యాపినెస్ లాయల్టీ కస్టమర్లకు 8వ తేదీ నుంచే సేల్ యాక్సెస్ ఉంటుందని చెప్పారు. ఈ నాలుగు రోజులూ ఉదయం 9 గంటల నుంచే స్టోర్ తెరిచి ఉంటుందని తెలిపారు. వినియోగదారుల సౌకర్యార్థం అదనపు పార్కింగ్, ఇతర వసతులు సహా అన్ని అవసరమైన ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల్ రీజినల్ మేనేజర్ మహ్మద్ షరీఫ్, మాల్ మేనేజర్ ఏజిల్ అరసన్, డీజీఎం విశాల్ కుమార్, ఫంటురా అసిస్టెంట్ మేనేజర్ సూర్యకాంత్, మార్కెటింగ్ మేనేజర్లు ఫణి, మను ఆంథోనీ పాల్గొన్నారు.

నేటి మనదేశమ్

## టీటీడీకి రూ.41 లక్షలు విరాళం




**తిరుమల,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టీటీడీకి చెందిన వివిధ పథకాలకు సోమవారం రూ.41 లక్షలు విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ లయన్ సాయి వెంకట్ టీటీడీ శ్రీ వేంకటేశ్వర సర్వ శ్రేయాస్ ట్రస్ట్‌కు స్వర్ణ విహార్ ఇన్ ఫ్రా ప్రాజెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరఫున రూ.10 లక్షలు, జయహో రామానుజ సినిమా ఆగస్టు 15న విడుదల సందర్భంగా మరో రూ.10 లక్షలు విరాళంగా అందించారు. అదేవిధంగా గుంటూరుకు చెందిన జి.లావణ్య శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.11,11,111 విరాళంగా అందించారు. రాజమహేంద్రవరం(రాజమండ్రి)కి చెందిన పాటంశెట్టి సాయి ఫణీంద్ర శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాద ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాతలు తిరుమలలోని అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థకు 32 వినతులు

**తిరుపతి, జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 32 వినతులు అందాయని కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 24 మంది వినతులు సమర్పించగా, ఎనిమిది మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. సుందరయ్య నగర్ నందు త్రాగునీటిలో మురుగునీరు కలుస్తోంది పరిష్కరించాలని, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద మురుగునీటి కాలువ బ్లాక్ అయ్యింది పరిష్కరించాలని, తుడా అపార్ట్మెంట్ నందు అనధికారికంగా గుడి నిర్మిస్తున్నారు పరిశీలించాలని, ఒకే ఇంటికి రెండు వాటర్ బిల్లులు వస్తున్నాయని, రైల్వే కాలనిలో రోడ్డు తవ్వి వదిలేసిన మట్టిని శుభ్రం చేయించాలని, వెంకటరమణ లేఔట్‌లో కాలువ పై జరుగుతున్న నిర్మాణాన్ని అడ్డుకోవాలని, పూల వీధిలో చెత్త తొలగించక పోవడం వలన పురుగులు పడి దుర్వాసన వస్తోందని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, మాలవ్యాజీ స్కూల్ పక్కన అంగన్వాడీ సెంటర్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, మారుతీ నగర్‌లో చెత్త తొలగించి, కాలువలు శుభ్రం చేయించాలని, ఈట్ స్ట్రీట్‌లో బోరు మరమ్మతులు చేయించాలని వినతులు, ఫిర్యాదులు అందినట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, డి.ఈ.లు వెంకట ప్రసాద్, రమణ, ఏసీపీ పార్వతి ప్రియ, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువారెడ్డి, మేనేజర్ హాసీమ్, శానిటరీ సూపర్ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు

## పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకే 'సర్' కార్యక్రమం

### -ఓటరు నమోదు అధికారి శారదా దేవి



**తిరుపతి,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో పారదర్శకమైన ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్వహిస్తున్నామని ఓటరు నమోదు అధికారి శారదా దేవి తెలిపారు. సోమవారం ఎస్.టి.వి నగర్, ఎస్.జి.ఎస్. కళాశాల ఏరియా, ఆటో నగర్, ముత్యాల రెడ్డి పల్లి, 12,13 వార్డు సచివాలయం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్) కార్యక్రమాన్ని ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని, వారికి ఎన్యూమరేషన్ ఫారాలు అందాయా అని అడిగి తెలుసుకున్నారు. 2002 తరువాత పారదర్శకమైన ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల కమిషన్ నేతృత్వంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్)కు ప్రజలందరూ సహకరించాలని తెలిపారు. మీకు ఇచ్చిన ఫారాలను పూర్తిగా నింపి వీలైనంత త్వరగా సంబంధిత సిబ్బందికి అందజేసి సహకరించాలని ఓటర్లకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు మహేష్, లలిత, స్వర్ణ వార్డు కార్యదర్శులు, బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓలు) తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 21న లక్ష సుదర్శన యంత్ర స్థాపన మహాయజ్ఞం

**తిరుపతి,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా తిరుపతికి సమీపంలో శ్రీదేవి,భూదేవి శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న అప్పలాయగుంటలో శ్రీ సుదర్శన సహిత యోగనరసింహ స్వామి ఆలయంలో లక్ష సుదర్శన యంత్ర స్థాపన మహా యజ్ఞాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యోగ నరసింహ స్వామి ఆలయ వ్యవస్థాపకరాలు కిడాంబి లక్ష్మీ రంగనాథన్, కార్యకర్తలు చిత్రపు హనుమంత రావ్, భాగవతుల జయలక్ష్మి, మద్దుల సరితా రాజ్‌కుమార్, సూరా శ్రీదేవి సుధాకర్, లీలావతి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అప్పలాయగుంటలో సుమారు రూ.20 లక్షలతో శ్రీ యోగనరసింహ స్వామి ఆలయ నిర్మాణం జరుగుతోందన్నారు. నిర్మాణం పూర్తయ్యే లోగా లక్ష శ్రీ సుదర్శన మంత్ర యంత్రాలను రాగి, ఇత్తడి, కంచు, వెండి, బంగారు రేకులపై రూ.252 చెల్లించే భక్తుల పేర్లు గోత్ర నామాదులతో ముద్రించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఇవ్వనున్నట్లు తెలిపారు. మరో ఏడాది లోగా పూర్తవుతుందని వారు తెలిపారు. అలాగే భక్తులు కోరితే రాగి యంత్రం రూ.1116, ఇత్తడి యంత్రం రూ.10 వేలు, కంచు యంత్రం, వెండి యంత్రానికి రూ.50 వేలు, బంగారు యంత్రానికి రూ.లక్ష చెల్లిస్తే ఆ మేరకు యంత్రాలను పూజాది కార్యక్రమాలు నిర్వహించి అందచేస్తామని పేర్కొన్నారు.




## గోగుల కుటుంబ సభ్యులపై పి.డి.యాక్ట్

**తిరుమల, జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమల పుణ్యక్షేత్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, భక్తులను, స్థానిక వ్యాపారులను, విధుల్లో ఉన్న పోలీసు మరియు భద్రతా సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేస్తూ వరుస నేరాలకు పాల్పడుతున్న గోగుల కుటుంబానికి చెందిన అలవాటు పడిన నేరస్థులపై తిరుపతి జిల్లా పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. సాధారణ చట్టాల ద్వారా వీరి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వుల మేరకు ప్రివెంటివ్ డిటెన్షన్(పి.డి.) యాక్ట్ అమలు చేశారు. పి.డి.యాక్ట్ కింద గోగుల కోటయ్య గోగుల శ్రీనివాసులు లను అరెస్ట్ చేసి, శ్రీకాళహస్తి సబ్ జైలు నుంచి కడప సెంట్రల్ జైలుకు తరలించారు. గోగుల శ్రీకాంత్ ప్రస్తుతం పరారీలో ఉండగా, అతడిని అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. అతనిపై కూడా పి.డి. యాక్ట్ అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ కుటుంబ పెద్ద గోగుల నాగేష్ తో కలిసి వీరు గత కొంతకాలంగా తిరుమలలో వివిధ నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. వీరు తిరుమలలో అక్రమ హాకింగ్ నిర్వహించడం, భక్తులకు నామాలు పెట్టే పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడడం, నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలను అధిక ధరలకు విక్రయించడం, తోటి వ్యాపారులను బెదిరించడం, ఎదిరించిన వారిపై దాడులకు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. అదేవిధంగా, పోలీసులు లేదా భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేసిన సమయంలో బ్లేడ్లతో తమను తాము గాయపరుచుకోవడం, గోడలకు తలలు బాదుకుని స్వీయ గాయాలు చేసుకోవడం ద్వారా పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేసే విధానాన్ని అనుసరిస్తూ విధుల్లో ఉన్న సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేయడం వీరి నేరశైలిగా గుర్తించారు. గత రెండేళ్లలో తిరుమల వన్ టౌన్, టూ టౌన్, రేణిగుంట, యెర్పేడు పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం, దొంగతనం, దౌర్జన్యం, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం తదితర కేసులు నమోదయ్యాయి. బెయిల్‌పై విడుదలైన ప్రతిసారి తిరిగి నేరాలకు పాల్పడుతూ, పోలీసు అధికారులను ఫోన్ల ద్వారా బెదిరింపులకు గురిచేస్తున్న నేపథ్యంలో వీరిపై పి.డి. యాక్ట్ అమలు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు,మాట్లాడుతూ, "తిరుమల ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రం. ఇక్కడికి వచ్చే లక్షలాది మంది భక్తుల భద్రత, ప్రశాంతత, తిరుమల పవిత్రతను కాపాడడం జిల్లా పోలీసుల అత్యున్నత బాధ్యత. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని భక్తులను, ప్రజలను, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదు. సాధారణ చట్టాలకు లొంగకుండా పదేపదే నేరాలకు పాల్పడుతున్న అలవాటు నేరస్థులపై పి.డి. యాక్ట్ వంటి కఠిన చట్టాలను నిర్దాక్షిణ్యంగా అమలు చేస్తాం. ప్రస్తుతం పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు గోగుల శ్రీకాంత్‌ను త్వరలోనే అరెస్ట్ చేసి అతనిపై కూడా పి.డి. యాక్ట్ అమలు చేస్తాం. తిరుమలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎంతటి వారినైనా కఠినంగా చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని స్పష్టం చేశారు.

## తిరుపతి జిల్లా సబ్ జూనియర్ టెన్నికాయిట్ జట్ల ఎంపిక పూర్తి

### -రాష్ట్ర స్థాయి పోటీలకు 8 మంది క్రీడాకారుల ఎంపిక



**తిరుపతి,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపికలు ఆదివారం బాలాయపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగాయి. జిల్లాలోని పలు విద్యాసంస్థల నుంచి సుమారు 40 మంది బాల బాలికలు ఈ ఎంపికల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్), ఉపాధ్యక్షుడు పైడి కోటేశ్వరరావు, పాఠశాల పీడీ వై. సుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. జిల్లా స్థాయిలో ఎంపిక కావడం గర్వకారణమని, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి తిరుపతి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు మహమ్మద్ రఫీ, అనూష, సునంద, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్న 38వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ బాలబాలికల ఛాంపియన్‌షిప్ లో తిరుపతి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. సబ్ జూనియర్ బాలికలు ఆర్. వెన్నెల–జడ్పీ హెచ్ఎస్, అత్తివరం, వై. పావని–జడ్పీ హెచ్ఎస్, అత్తివరం, పి.చెంచు గంగమ్మ–జడ్పీ హెచ్ఎస్, అత్తివరం, ఎస్.కె. హలీమా–జడ్పీ హెచ్ఎస్, బాలాయపల్లి, సబ్ జూనియర్ బాలురు: జె. వివేకానంద–జడ్పీ హెచ్ఎస్, అత్తివరం, జె. మధు–జడ్పీ హెచ్ఎస్, అత్తివరం, జె. హర్ష– జడ్పీ హెచ్ఎస్, అత్తివరం, జి. ప్రభాస్–జడ్పీ హెచ్ఎస్, జయంపు ఎంపికైన వారిలో ఉన్నారు.

## జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులపై స్విమ్స్‌లో అవగాహన



**తిరుపతి,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్విమ్స్ క్లినికల్ వైరాలజి విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఆర్సి పురం మండలం కమ్మపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా॥రామ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లినికల్ వైరాలజి విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా॥రామకృష్ణ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జూనోసిస్ అంటారని, వ్యక్తిగత పరిశుభ్రత, పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం, సురక్షితమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఈ వ్యాధులను నివారించవచ్చని వివరించారు. ప్రజలు పరిశుభ్రత పాటించడం, అనారోగ్యంతో ఉన్న జంతువులకు దూరంగా ఉండడం, ఏవైనా అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని వైద్య నిపుణులు సూచించారు. "వన్ హెల్త్" భావన ప్రకారం మనుషులు, జంతువులు, పర్యావరణ ఆరోగ్యం పరస్పరం అనుసంధానమై ఉన్నాయని, జంతువుల ఆరోగ్య సంరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తే జూనోటిక్ వ్యాధుల వ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టవచ్చని వివరించారు. క్లినికల్ వైరాలజి విభాగం సైంటిస్టు వెటర్నరి కన్సల్టెంట్ డా॥ మాధవ, వెటర్నరి డాక్టర్ జయకిషోర్ మరియు డా॥ భువనేశ్వరిలు మాట్లాడుతూ రేబీస్, బ్రూసెల్లోసిస్, లెప్టోస్పిరోసిస్ వంటి జూనోటిక్ వ్యాధుల నివారణలో ప్రజల అవగాహన, సమయానికి వైద్య పరీక్షలు, టీకాలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ డా॥ఛత్రప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా జూనోటిక్ వ్యాధుల వ్యాప్తిని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. జంతువులు కరిచినప్పుడు లేదా అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స, టీకాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ వైరాలజీ విభాగం నుండి భూపతి, యశ్వంత్, పసల రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎలెక్ట్రిక్ బస్సుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా ఉద్యమ శంఖారావం

**తిరుపతి,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో, భూమన అభినయ్ రెడ్డి పిలుపు మేరకు సోమవారం నిర్వహించిన ఆర్టీసీ ఉద్యోగుల సంఘీభావ ర్యాలీకి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎలక్ట్రిక్ బస్సులకు మద్దతు తెలుపుతూనే వాటి నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించొద్దని,ఏపిఎస్ఆర్‌టిసి ద్వారా ప్రభుత్వమే నిర్వహించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం సేవలందిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు సాంకేతిక సిబ్బందికే అవకాశం కల్పించాలన్నారు. భారీ సంఖ్యలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మిక సంఘాలు, పార్టీ శ్రేణులు, ప్రజలు రోడ్లపైకి వచ్చి తమ నిరసనను తెలియజేశారు. దశాబ్దాలుగా ప్రజల విశ్వాసాన్ని సంపాదించిన ఏపిఎస్ఆర్టీసీని బలహీనపరిచే ఏ ప్రయత్నాన్నైనా ప్రజలు సహించరని ర్యాలీలో పాల్గొన్న భూమన అభినయ రెడ్డి స్పష్టం చేశారు. ఎలెక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి, ఆర్టీసీ ఉద్యోగులతోనే వాటిని నడపాలి, అలాగే మూసివేసిన 12 డిపోలను తిరిగి ఆర్టీసీ కి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇది ముగింపు కాదని, ప్రజా రవాణా పరిరక్షణ కోసం ప్రారంభమైన ఉద్యమం అని, రాష్ట్రం మొత్తం వినిపించే వరకు ఈ ఉద్యమం ఆగదని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సులకు మద్దతు..ఎలెక్ట్రిక్ బస్సుల ప్రైవేటీకరణకు వ్యతిరేకం అంటూ నినాదాలు చేశారు.

## భక్తుల బ్యాగ్‌ను గుర్తించి భద్రంగా అప్పగింత

### - సీసీటీవీ పర్యవేక్షణతో వేగంగా స్పందించిన విజిలెన్స్ అధికారులు

**తిరుమల,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమలకు విచ్చేసిన ఓ భక్తుడు పోగొట్టుకున్న విలువైన బ్యాగ్‌ను టీటీడీ కమాండ్ కంట్రోల్ సెంటర్ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహ రించి గుర్తించి, అందులోని నగదు, బంగారం, వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్‌తో పాటు ఇతర విలువైన వస్తువులను యథాతథంగా యజమానులకు భద్రంగా అప్పగించారు. సీసీటీవీ ద్వారా జీప్‌ను గుర్తించిన అధికారులు తెలంగాణకు చెందిన రామకృష్ణ కుటుంబ సభ్యులు మేదరమిట్ట నుండి గోగర్భ డ్యాం సమీపంలోని మఠాలకు మహేంద్ర టాక్సీ జీప్‌లో ప్రయాణిస్తున్న సమయంలో తమ బ్యాగ్‌ను వాహనంలోనే మరిచిపోయారు. విషయం గుర్తించిన వెంటనే టీటీడీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఫిర్యాదు చేయగా, అధికారులు వెంటనే సీసీటీవీ ప్లేబ్యాక్ ఫుటేజీలను పరిశీలించి సంబంధిత జీప్‌ను గుర్తించారు. అప్పటికే తిరుపతికి చేరుకున్న డ్రైవర్‌ను సంప్రదించి బ్యాగ్‌ను భద్రంగా స్వాధీనం చేసుకుని, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో భక్తుల సమక్షంలో బ్యాగ్‌ను తెరిచి అందులోని విలువైన వస్తువులను ధృవీకరించి యథాతథంగా అప్పగించారు. రూ.23,000 నగదు 4 గ్రాముల బంగారు ఉంగరం 12 గ్రాముల బంగారు గొలుసు 15 గ్రాముల వెండి కాళ్ల పట్టీలు ఒప్పో మొబైల్ ఫోన్ సుమారు రూ.1.20 లక్షల విలువైన దంత పరికరం బ్యాగులో ఉంది. విలువైన వస్తువులను ఎలాంటి నష్టం లేకుండా తిరిగి అందజేసిన టీటీడీ కమాండ్ కంట్రోల్ సెంటర్ అధికారులు, విజిలెన్స్ సిబ్బందికి భక్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన టీటీడీ భద్రతా వ్యవస్థను అభినందించారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు తమ విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని టీటీడీ సూచించింది. ఈ సందర్భంగా విజిలెన్స్ సిబ్బందిని టీటీడీ సీవీఎస్‌వో కె.వి. మురళీకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో వీజీవో సురేంద్ర, ఏవీఎస్‌వోలు వెంకటరమణ, నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 443 అర్జీలు

### -పిజిఆర్ఎస్ అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి-జిల్లా కలెక్టర్



**తిరుపతి,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన, సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా రెవిన్యూ అధికారి జి.నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శివశంకర్ నాయక్, భరత్ నాయక్, రోజ్ మాండ్, నాగార్జున లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీల ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్,తేనీరు తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ ఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 443 అర్జీలు రాగా అందులో రివిన్యూ శాఖకు సంబంధించినవి అత్యధికంగా 201 ఉన్నాయి. మిగతావి శాఖల వారీగా మున్సిపల్ పరిపాలన–62, సర్వే, సెటిల్మెంట్స్ అండ్ భూ రికార్డులు–34, పంచాయతీ రాజ్–23, పోలీసు శాఖ–18, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ–15, పాఠశాల విద్యాశాఖ–12, వ్యవసాయ శాఖ–7, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ, పౌర సరఫరాల శాఖ, గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ శాఖలకు సంబంధించి ఆరు వంతున, దేవాదాయ శాఖ–5, ఏపీ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ, జలవనరుల శాఖ లకు సంబంధించి నాలుగు వంతున, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖ, వైద్య విద్యాశాఖ, ప్రజారోగ్య శాఖ, సెకండరీ హెల్త్ డైరెక్టర్ శాఖలకు సంబంధించిన 3 వంతున, ఆర్థిక శాఖ, అటవీ శాఖ, దివ్యాంగులు, వృద్ధుల సహాయ సంస్థ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ రోడ్లు, భవనాల శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించినవి రెండు వంతున, సహకార శాఖ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, సమగ్ర శిక్ష, మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ), రవాణా శాఖ, ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్, ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ షెడ్యూల్డ్ కులాల సహకార ఆర్థిక సంస్థ, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ, క్రీడా ప్రాధికార సంస్థ, ఇంటర్మీడియట్ విద్యా మండలి, ఉద్యానవన శాఖ, కళాశాల విద్యాశాఖ, ఏపీ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, ఏపీ కాలుష్య నివారణ మండలి కి సంబంధించి ఒక్కటి వంతున ఉన్నాయి.

## 'అమరావతి ఛాంపియన్‌షిప్-2026' పోస్టర్స్ ఆవిష్కరణ




**తిరుపతి,జూలై 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చేనెలలో నిర్వహించనున్న జాతీయ క్రీడా దినోత్సవం పోస్టర్లను సోమవారం తిరుపతిలో జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రతి సంవత్సరం, జాతీయ మరియు అంతర్జాతీయ వేదికపై దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావడంలో మన క్రీడా దిగ్గజాలు చేసిన కృషికి, నివాళులు అర్పించే దిశగా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా "అమరావతి ఛాంపియన్‌షిప్" ను జరుపుకుంటాము. ఈ క్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి శశిధర్, జిల్లా క్రీడా అభివృద్ధి సంస్థ కోచ్‌లతో కలసి "అమరావతి ఛాంపియన్‌షిప్––2026" పోస్టర్స్ లను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్‌షిప్–2026లో అండర్–17 మరియు అండర్–23 విభాగాలలో బాలురు, బాలికలకు పాల్గొన వచ్చునని శశిధర్ తెలిపారు. ఆసక్తికరమైన క్రీడాకారులందరూ, క్రీడా యాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకుని, ఈ పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శశిధర్ కోరారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027